మంగళవారం 26 నవంబర్ 2024

https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



శ్రీశైలం-హైదరాబాద్ హైవే రద్దీ
**పరిష్కారానికి చర్యలు**
- సీఎం చంద్రబాబు

వివరాలు 2లో..

## ఇంటింటా.. సౌర వెలుగు!

- ఇక ప్రతి ఇల్లూ విద్యుత్కేంద్రం కావాలి
- ప్రభుత్వ కార్యాలయాలనూ సిద్ధం చేయండి
- సోలార్ పవర్‌లో స్వావలంబన సాధించాలి
- ఎస్సీ ఎస్టీల ఇళ్లపై సోలార్ పలకల ఏర్పాటు
- వినియోగదారుల ఆదాయానికి ఇదొక ఛాన్స్
- పీఎం సూర్యఘర్, కుసుమ్ ద్వారా గరిష్ట లబ్ది
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు
- సౌర విద్యుత్‌పై సీఎం సమీక్ష



2లో

రాష్ట్రంలోని ప్రతీ ఇల్లూ.. ప్రతీ కార్యాలయం సౌరశక్తిని ఒడిసిపట్టే విద్యుదుత్పత్తి -వినియోగంలో స్వావలంబన దిశగా అడుగులేయాలి. రాష్ట్రం సౌర విద్యుదుత్పత్తి కేంద్రం కావాలి. సౌర విద్యుత్ పూర్తిస్థాయి వినియోగానికి అవసరమైన ప్రణాళిక సత్వరం అమలుచేయండి. రాష్ట్రానికున్న ప్రత్యేక వాతావరణ పరిస్థితులతో సోలార్ విద్యుదుత్పత్తిలో తిరుగులేని ఫలితాలు సాధించొచ్చు. సోలార్ విద్యుత్‌తో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించి.. సోలరైజేషన్‌లో నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు నడుంగట్టాలి. ఇళ్లపై సోలార్ విద్యుదుత్పత్తి ద్వారా వినియోగదారుడు తనకు అవసరమైన విద్యుత్‌ను ఉచితంగా పొందడమే కాకుండా.... తాను వినియోగించుకోగా మిగిలిన విద్యుత్‌తో అదనంగా ఆదాయం పొందే పరిస్థితి ఉంటుందన్న అవగాహన కలిగించండి. కేంద్ర కార్యక్రమాలైన పీఎం సూర్యఘర్, కుసుమ్ పథకాలను ప్రజలకు చేరువ చేయాలి.

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

### ఇక ఏకగవాక్ష విధానం

- డిసెంబరు 31 నుండి సింగిల్ విండో అనుమతులు
- భవనాలు, లేఅవుట్ల అనుమతులు సులభతరం
- 15 మీటర్ల ఎత్తు భవనాలకు ప్లాన్ అనుమతులు అక్కర్లేదు
- టీడీఆర్ అంశాలపై 15 రోజుల్లో పూర్తిస్థాయి సమీక్ష
- రాజధానిలో త్వరలోనే ఐకానిక్ భవన నిర్మాణాల పనులు
- సీఎం సమీక్షా నిర్ణయాలను ప్రకటించిన మంత్రి నారాయణ



5లో..

### రహదారులకు సంక్రాంతి శోభ

- ఆర్ అండ్ బి పనులపై సీఎం చంద్రబాబు సమీక్ష

వివరాలు 4లో..

### రాష్ట్రంలో తొలి కంటైనర్ ఆసుపత్రి ప్రారంభం

- గిరి గ్రామాలు, కొండ ప్రాంతాల్లో సేవలు
- మంత్రి గుమ్మడి సంధ్యారాణి

వివరాలు 7లో..

### ఐపీఎల్ వేలంలో సరికొత్త చరిత్ర

13 ఏళ్ల బుడతడికి రూ.1.1 కోట్లు



8లో

### సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు, దుర్భాషలు

- ప్రశ్నించినందుకు వేధింపులు
- నా భర్తపై చర్యలు తీసుకోవాలి
- తనఖా భూమిని స్వాధీనం చేసుకున్నారు, న్యాయం చేయండి
- మంత్రి నారా లోకేష్ 46వ రోజు ప్రజాదర్బార్‌కు విన్నపాల వెల్లువ
- సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ




6లో



### భారతీయతను బోధించండి

- కుటుంబ వ్యవస్థ గొప్పతనాన్ని నేటితరానికి చెప్పాలి
- విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచేందుకు కృషి చేయండి
- ప్రభుత్వ సలహాదారు చాగంటికి సీఎం చంద్రబాబు సూచన
- తన బాధ్యత నెరవేర్చేందుకు కృషి చేస్తానన్న చాగంటి
- సచివాలయంలో చాగంటిని సన్మానించిన ముఖ్యమంత్రి

వివరాలు 2లో..

### మంత్రి లోకేష్‌ని కలిసిన సలహాదారు చాగంటి

వివరాలు 5లో..

### పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

- రాష్ట్రాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషిచేయాలి
- వారసత్వ ప్రాంతాలను సంరక్షించేలా చర్యలు చేపట్టాలి
- పర్యాటకాభివృద్ధితోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచనలు
- టెంపుల్, ఎకో, అడ్వెంచర్, హెరిటేజ్ టూరిజంపై సమీక్ష



9లో

### గోపిరెడ్డి అండతో ఆలయ సామగ్రి దోచారు

- ఆలయ ట్రస్టీగానూ నియమించారు.. తొలగించండి
- నరసరావుపేటకు చెందిన సూలం రమేష్ ఫిర్యాదు
- పోలీసుల వల్ల కొడుకు చనిపోయాడని తల్లి ఆవేదన
- ప్రజా వినతుల కార్యక్రమానికి తరలివచ్చిన అర్జీదారులు

8లో



# ఇంటింటా.. సౌర వెలుగు!

- ఇక ప్రతి ఇల్లూ విద్యుత్కేంద్రం కావాలి
- ప్రభుత్వ కార్యాలయాలనూ సిద్ధం చేయండి
- సోలార్ పవర్‌లో స్వావలంబన సాధించాలి
- ఎస్సీ ఎస్టీల ఇళ్లపై సోలార్ పలకల ఏర్పాటు
- వినియోగదారుల ఆదాయానికి ఇదొక ఛాన్స్
- పీఎం సూర్యఘర్, కుసుమ్ ద్వారా గరిష్ఠ లబ్ది
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు
- సౌర విద్యుత్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలోని ప్రతీ ఇల్లూ.. ప్రతీ కార్యాలయం సౌరశక్తిని ఒడిసిపట్టి విద్యుదుత్పత్తి -వినియోగంలో స్వావలంబన సాధించే దిశగా అడుగులేయాలని సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్రం సౌర విద్యుదుత్పత్తి కేంద్రం కావాలని, సౌర విద్యుత్‌ను పూర్తిస్థాయి వినియోగానికి అవసరమైన ప్రణాళిక సత్వరం అమలుచేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రానికి ఉన్న ప్రత్యేక వాతావరణ పరిస్థితుల కారణంగా సోలార్ విద్యుదుత్పత్తిలో తిరుగులేని ఫలితాలు సాధించవచ్చని సీఎం అన్నారు. సోలార్ విద్యుత్‌తో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించి. సోలరైజేషన్‌లో నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని ముఖ్యమంత్రి సూచించారు. తమ ఇళ్లపై సోలార్ విద్యుదుత్పత్తి ద్వారా వినియోగదారుడు తమకు అవసరమైన విద్యుత్‌ను ఉచితంగా పొందడమే కాకుండా.... తాను వినియోగించుకోగా మిగలిన విద్యుత్‌తో అదనంగా ఆదాయంపొందే పరిస్థితి రావాలని సీఎం అన్నారు. దీనికోసం ప్రజలను చైతన్యపర్చి..కేంద్ర కార్యక్రమాలైన పీఎం సూర్యఘర్, కుసుమ్ పథకాలను వారికి చేరువ చేయాలన్నారు. రాష్ట్రంలో సౌరవిద్యుత్‌కు ప్రోత్సాహంలో భాగంగా చేపట్టిన సోలరైజేషన్ అమలుతీరును సచివాలయంలో చంద్రబాబు సమీక్షించారు. ప్రజల ఇళ్లపై సౌరవిద్యుదుత్పత్తి, 100శాతం సౌర విద్యుత్ గ్రామాలు ఏర్పాటు, ఎస్సీ,ఎస్టీ ఇళ్లపై 100శాతం సోలార్ విద్యుత్ పరికరాల ఏర్పాటు, పూర్తిస్థాయి సోలరైజేషన్‌లో భాగంగా కుప్పాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని చేపట్టే పనులపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాలకు పూర్తిస్థాయిలో సౌరవిద్యుత్ వినియోగంలోకి తెచ్చే అంశంపైనా అధికారులు సాధ్యాసాధ్యాలను వివరించారు. కేంద్ర పథకాలు, రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై ప్రజెంటేషన్ ద్వారా సీఎంకు వివరించారు.

### భారీ ఎత్తున కేంద్ర సబ్సిడీ

పీఎం సూర్య ఘర్ -ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని ఈఏడాది ఫిబ్రవరి 13న ప్రధాని మోదీ ప్రారంభించారు. ఏడాదిలో కోటి గృహాలు ఈ పథకం పరిధిలోకి తేవాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకోగా, 30లక్షల ఇళ్లలో ఈ పథకాన్ని ఏపీలో అమలు చేయాలని లక్ష్యం పెట్టుకున్నట్టు అధికారులు తెలిపారు. సోలార్ రూఫ్ టాప్ అమర్చుకునే గృహ విద్యుత్ వినియోగదారులకు కేంద్రం భారీగా సబ్సిడీ ఇస్తోంది. 1కిలోవాట్‌కి ఎస్ఆర్టీ (సోలార్ రూఫ్ టాప్)కి రూ.50 వేలు ఖర్చవుతుండగా, రూ.30 వేలు సబ్సిడీ రానుంది. అలాగే 2 కిలోవాట్లకు వ్యయం రూ.1లక్ష కాగా సబ్సిడీ రూ.60 వేలు, 3 కిలోవాట్లకు పెట్టుబడి రూ.లక్షా 45వేలు కాగా రూ.78 వేలు సబ్సిడీ రూపంలో కేంద్రం ఇస్తుంది.

### రాష్ట్రంలో 6 లక్షలమంది రిజిస్ట్రేషన్

రాష్ట్రంలో ఈ పథకానికి తమ సమ్మతి తెలుపుతూ ఇప్పటివరకు 6,33,045 మంది గృహ విద్యుత్ వినియోగదారులు రిజిస్టర్ చేసుకున్నారని అధికారులు తెలిపారు. వీరిలో పీఎం సూర్యఘర్ పథకానికి 70,110 దరఖాస్తు చేయగా, 4,961 గృహాలపై ఇప్పటికే సోలార్ ప్యానల్స్ అమర్చడం పూర్తయ్యింది.

### కుప్పం సెగ్మెంట్‌లో 100శాతం సౌర విద్యుత్ లక్ష్యం

కుప్పం సెగ్మెంట్‌లో 50,314 ఇళ్లు సౌరవిద్యుత్ అమర్చేందుకు అనుకూలంగా ఉండగా, 50,312 ఇళ్ల యజమానులు తమ అంగీకారం తెలిపారు. దీంతో కుప్పం నియోజవర్గంలో 2 కోట్ల 66 లక్షల 15 వేల 521 చదరపు అడుగుల విస్తీర్ణంలో సోలార్ రూఫ్ టాప్ విద్యుదుత్పత్తికి అవకాశం లభిస్తుంది. పీఎంఎస్జీఎంబీవై కింద చేపట్టిన కుప్పం రెస్కో ప్రాజెక్టుకు మొత్తం రూ.286 కోట్లు వ్యయం అవుతుంది. ఇందులో రూ.172 కోట్లు కేంద్రం నుంచి సబ్సిడీ రూపంలోనే వస్తుంది. మిగిలిన రూ.114 కోట్లను లబ్దిదారులు రుణంగా పొందే అవకాశముందని అధికారులు వివరించారు.

### ప్రభుత్వ భవనాలకు సోలార్ విద్యుత్

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలపైనా సౌర పలకలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వానికి 100 మెగావాట్లకు సుమారు రూ.349 కోట్ల నుంచి రూ.379 కోట్ల వరకు విద్యుత్ బిల్లుల రూపంలో ఆదా కానుంది. లక్ష యూనిట్లకు పైగా విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో 2,186 ప్రభుత్వ కార్యాలయాలను సోలార్ రూఫ్ టాప్స్ కోసం గుర్తించడం జరిగింది. 19,53,369 చదరపు మీటర్ల పరిధిలో సౌర విద్యుత్ పలకలు ఏర్పాటు చేస్తే ఏడాదికి 2,62,252 కిలోవాట్ల విద్యుదుత్పత్తి అవుతుంది. అయితే ఇందుకు రూ.262.25 కోట్లు వ్యయం కానుంది. ఎన్టీపీసీ విద్యుత్ వ్యాపార్ నిగమ్ లిమిటెడ్ ఈ కార్యక్రమాన్ని చేపట్టనుంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున జీఏడీ లేదా ఆర్థిక శాఖ గ్యారెంటీ ఇవ్వాలని నిర్ణయించారు.

### పేద ఎస్సీ, ఎస్టీ గృహాలకు ప్రాధాన్యత

పేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు గృహానికి నెలకు ప్రస్తుతం 200 యూనిట్ల వరకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకం కింద 20.38 లక్షల గృహ వినియోగదారులు లబ్దిపొందుతున్నారు. ఇప్పుడు ఈ గృహాలకు పీఎంఎస్జీఎంబీవై కింద సోలార్ రూఫ్ టాప్ ప్యానెల్స్ అమర్చాలని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. అయితే 81శాతం గృహాలకు సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసేందుకు వెసులుబాటు లేదు. మిగిలిన 19శాతం గృహాలకు ఫస్ట్‌ఫేజ్ కింద పీఎంఎస్జీఎంబీవై పథకాన్ని అమలు చేసే అవకాశముందని అధికారులు ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

### పీఎం కుసుమ్ స్కీం పథకం

పీఎం కుసుమ్ స్కీం పథకం కింద రాష్ట్రంలో 14,94,453 వ్యవసాయ విద్యుత్ పంపు సెట్లకు సోలార్ ప్యానల్స్ అమర్చే అవకాశముందని అధికారులు తెలిపారు. కుసుమ్ పథకం ద్వారా ఫేజ్ 1కింద 3572 మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు.

### మోడల్ సోలార్ విలేజ్

రాష్ట్రంలో మొత్తం 132 గ్రామాలను సోలార్ విలేజస్‌గా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ గ్రామాల్లో 100శాతం ఇళ్లు సోలార్ విద్యుదుత్పత్తిని సాధిస్తాయి. సోలార్ గ్రామాలకు కేంద్రం రూ.1 కోటిసాయం కింద ఇవ్వనుంది.అధికారుల ప్రజెంటేషన్ అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ పథకం అమలుపై వేగంగా ముందుకెళ్లాలని సూచించారు. విద్యుత్ బిల్లల భారం నుంచి విద్యుదుత్పత్తి ద్వారా ఆదాయం ఆర్జించే అవకాశాన్ని ప్రజలకు కల్పించవచ్చని సీఎం అన్నారు. కేంద్ర పథకాలను వేగంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు మొత్తం 55 వేల ఎలక్ట్రిక్ వాహనాలు ఉన్నాయని అధికారులు తెలపగా.... వీటిలో ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు, వ్యక్తిగత వాహనాలకు విరివిగా చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ వాహనాలకు తీసుకునే విద్యుత్ టారిఫ్‌లను కూడా నిర్ణయించాలని అధికారులకు సూచించారు.

# భారతీయతను బోధించండి

- కుటుంబ వ్యవస్థ గొప్పతనాన్ని నేటితరానికి చెప్పాలి
- విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచేందుకు కృషి చేయండి
- ప్రభుత్వ సలహాదారు చాగంటికి సీఎం చంద్రబాబు సూచన
- తన బాధ్యత నెరవేర్చేందుకు కృషి చేస్తానన్న చాగంటి
- సచివాలయంలో చాగంటిని సన్మానించిన ముఖ్యమంత్రి



అమరావతి (చైతన్య రథం): భారతీయ కుటుంబ వ్యవస్థ గొప్పతనాన్ని నేటితరం తెలుసుకోవాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మంచి చదువు, ఉద్యోగం, భవిష్యత్‌తో పాటు నైతిక విలువలు కూడా అవసరమని, అప్పుడే మంచి సమాజం ఆవిష్కృతం అవుతుందని... ఆ దిశగా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తనను సచివాలయంలో సోమవారం కలిసిన ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావును విద్యార్థులు, యువతలో నైతిక విలువలు పెంచేందుకు ప్రయత్నించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. నైతిక విలువలు పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని చాగంటిని కోరారు. స్కూళ్లు, కాలేజీలు, యూనివర్సిటీల్లో ప్రవచనాలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా యువతలో మంచిని పెంచే ప్రయత్నం చేయొచ్చన్నారు. ప్రపంచంలో మరే దేశానికి లేని ఉన్నతమైన సంస్కృతి, సాంప్రదాయాలు మన సొంతమని... వాటిని ఈ తరానికి, భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. మహిళలను గౌరవించడం, పెద్దలు, తల్లితండ్రుల మాటలకు విలువ ఇవ్వడం వంటివి యువతకు నేర్పించాలన్నారు. మారుతున్న కాలంలో అనేక అంశాలు విద్యార్థులు, యువతపై దుష్ప్రభావం చూపుతున్నాయని నైతిక విలువల పతనానికి ఇవి కారణం అవుతున్నాయని అన్నారు. సుమతీ- వేమన శతకాలు, నీతి కథలు, మంచి మాటలు, ప్రత్యేక క్లాసుల ద్వారా విద్యార్థులు, యువతలో విలువలు పెంచేందుకు ప్రయత్నం చేస్తామని, విద్యాశాఖలో చేపట్టే కార్యక్రమాలపై ఇప్పటికే మంత్రి లోకేష్‌తో చర్చించానని చాగంటి కోటేశ్వరావు తెలిపారు. ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన తరువాత తొలిసారి తన వద్దకు వచ్చిన చాగంటి కోటేశ్వరరావు యోగక్షేమాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోటేశ్వరావును సీఎం శాలువాతో సత్కరించి, వెంకటేశ్వర స్వామి ప్రతిమను అందించారు.

# శ్రీశైలం-హైదరాబాద్ హైవే రద్దీ పరిష్కారానికి చర్యలు: సీఎం చంద్రబాబు



అమరావతి (చైతన్య రథం): శ్రీశైలం -హైదరాబాద్ హైవేపై ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు దృష్టిపెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యపై అధికారులతో మాట్లాడిన ముఖ్యమంత్రి, శ్రీశైలం ఘాట్ రోడ్డుతోపాటు దేవాలయానికివెళ్లే మార్గాల్లో రద్దీని చక్కదిద్దాలని సూచించారు. రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రాకపోకలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, శాశ్వత పరిష్కారానికి సమగ్ర అధ్యయనం చేపట్టాలని అధికారులకు నిర్దేశించారు. కార్తీక మాసం కావడంతో వేలాదిగా భక్తులు ఇతర రాష్ట్రాల నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వస్తున్నారని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రానున్న రోజుల్లో పెరిగే రద్దీని దృష్టిలో పెట్టుకుని ఇప్పటినుంచే తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యను స్వయంగా పరిశీలించి, పరిష్కార మార్గానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆర్ అండ్ బీ, ఎన్‌హెచ్ఏఐ అధికారులను ఆదేశించారు. అవసరమైతే పొరుగు రాష్ట్ర అధికారులతో సమస్యపై చర్చించి, సమన్వయంతో భక్తుల ఇబ్బందులను తొలిగించాలన్నారు.

ముప్పైయేళ్ల చంద్రన్న స్మార్ట్ అండ్ హార్డ్‌వర్క్

# అభివృద్ధి.. సంక్షేమం.. సామాజిక న్యాయానికి పట్టం

సెప్టెంబరు 1, 1995న శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు ముఖ్యమంత్రిగా తొలుత బాధ్యతలు చేపట్టి సెప్టెంబరు 1, 2024 నాటికి 30వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంలో.. మహోజ్వల విజయాలు కొన్ని.

## విజనరీ లీడర్ మన చంద్రన్న




సామాజిక న్యాయం

## గిరిజన సూర్యుడు మన చంద్రన్న

1. అక్షరాస్యత పెంచడానికి 1841 పాఠశాలలు, 65 రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు
2. 20 జూనియర్ కాలేజీల మంజూరు
3. విదేశీ విద్యా పథకం రూ.10 లక్షల నుండి రూ.15 లక్షలకు పెంపు
4. ఎన్‌టిఆర్ విద్యోన్నతి ద్వారా సివిల్స్‌కు సిద్ధమయ్యే విద్యార్థుల శిక్షణ కోసం 5 జాతీయస్థాయి కోచింగ్ సెంటర్ల ఏర్పాటు
5. టీచర్ పోస్టులను 100% గిరిజనులతో భర్తీ చేసేలా జీవో నెం.3 విడుదల
6. గిరిపుత్రికా కళ్యాణం ద్వారా పెళ్ళి పీటలపైనే రూ.50 వేలు అందించారు.
7. ఇళ్ళ నిర్మాణంలో రూ.50 వేల నుండి రూ.1 లక్ష వరకు అదనపు సహాయం
8. గిరి నెట్‌వర్క్ పథకం ద్వారా 184 మొబైల్ టవర్లు ఏర్పాటు
9. ఫీడర్ అంబులెన్సులు ఏర్పాటు
10. గ్రావిటీ నీటి పథకాలు 205 పూర్తిచేసి శుద్ధమైన నీరు సరఫరా
11. కాఫీ సాగు 2 లక్షల ఎకరాలకు పెంచేందుకు రూ.526 కోట్లు ఖర్చు



# రహదారులకు సంక్రాంతి శోభ

- పాత్ హెూల్ ఫ్రీ ప్రాజెక్టు పూర్తికి నిర్ణయం
- రూ.861 కోట్లతో శరవేగంగా పనులు
- పీపీపీ విధానంలో 18 ఎన్‌హెచ్ నిర్మాణ పనులు
- నరేగా నిధులతో గ్రామాల్లో అంతర్గత రోడ్లు
- ఆర్ అండ్ బి పనులపై సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో రూ.861 కోట్లతో చేపట్టిన 'గుంతలు లేని రోడ్లు' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం సమీక్షించారు. నవంబర్ 2న అనకాపల్లి జిల్లాలో ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పనులు సంక్రాంతి నాటికి పూర్తి కావాలని సీఎం ఆదేశించారు. మొక్కుబడిగా పనులు చేస్తే సహించేది లేదని... పూర్తి నాణ్యతతో రోడ్ల మరమ్మతులు జరగాలని సీఎం ఆదేశించారు. నాణ్యత లేకపోతే కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలన్నారు. ప్రైవేటు సంస్థల ద్వారా రోడ్ల నాణ్యతపై నివేదికలు తెప్పించాలని సూచించారు. ప్రజల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చేలా రోడ్ల మరమ్మతులు సమగ్రంగా జరగాలని సీఎం అన్నారు. 20రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా రోడ్లపైగుంతలు పూడ్చి బాగుచేసే పనులు జరుగుతున్నాయి. సచివాలయంలో సోమవారం జరిగిన సమీక్షలో ఈపనుల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి వివ రించారు. రాష్ట్రంలో మొత్తం 45,378 కి.మీ ఆర్ అండ్ బి రోడ్ నెట్‌వర్క్ ఉండగా, అందులో 22,299 వేల కి.మీమేర మరమ్మతులు చేయాల్సి ఉందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.861 కోట్లతో ముమ్మరంగా మరమ్మతులు చేస్తున్నామని అధికారులు వివరించారు. ఇప్పటి వరకు 1,991 కి.మీ మేర రోడ్లపై గుంతలు పూడ్చినట్టు అధికారులు వివరించారు. మరోవైపు 1,447 కి.మీ మేర రోడ్లు రిపేర్ చేయలేని స్థితిలో ఉన్నాయని అధికారులు తెలిపారు. వీటిస్థానంలో పూర్తిగా కొత్త రోడ్లు నిర్మించాల్సి ఉందని.. వీటికి రూ.581 కోట్లు ఖర్చవుతుందని అధికారులు తెలిపారు. అవసరం మేరకు నిధులు రానున్న రోజుల్లో మంజూరు చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. 23,521 కి.మీమేర జంగిల్ క్లియరెన్స్ చేయాల్సి ఉందని... వీటికి రూ.33 కోట్లు ఖర్చవుతుందని... ఈ పనులు కూడా రానున్న రోజుల్లో చేపడతామని అధికారులు తెలిపారు.

## పీపీపీ పద్ధతిలో స్టేట్ హైవేలు

రాష్ట్రంలో మొత్తం 12,653 కిలోమీటర్ల మేర రాష్ట్ర హైవే ఉన్నాయని.. వీటిలో 10,200 కి.మీ మేర పీపీపీ పద్ధతిలో నిర్మాణం చేపట్టవచ్చని అంచనాకు వచ్చినట్లు అధికారులు వివరించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన విధంగా పీపీపీ పద్ధతిలో రోడ్ల నిర్మాణం కోసం ప్రణాళికలు సిద్ధం చేసినట్ల అధికారులు వివరించారు. రాష్ట్రంలో మొదటి ఫేజ్ కింద 18 రోడ్లను 1,307 కి.మీ మేర పీపీపీ పద్ధతిలో నిర్మించేందుకు నిర్ణయించారు. వీటికి డీపీఆర్‌లు తయారు చేసి సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. పీపీపీ మోడల్‌లో డీబీఎఫ్‌వోటీ (డిజైన్, బిల్ట్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్), బీవోటీ (బిల్ట్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్), హెచ్ఏఎం (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్), టీవోటీ (టోల్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్), ఓఎంటీ (ఆపరేట్ మెయిన్‌టెన్ అండ్ ట్రాన్స్‌ఫర్) వంటి విధానాల ద్వారా రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఆ విధానంలో చిలకలపాలెం- రామభద్రపురం- రాయగడ, విజయనగరం -పాలకొండ, కళింగపట్నం- శ్రీకాకుళం- పార్వతీపురం, భీమునిపట్నం -నర్సీపట్నం, కాకినాడ- జొన్నాడ, కాకినాడ-రాజమహేంద్రవరం కెనాల్, ఏలూరు- మేడిశెట్టివారిపాలెం, నర్సాపురం- అశ్వారావుపేట, ఏలూరు- జంగారెడ్డిగూడెం, గుంటూరు-పర్చూరు, గుంటూరు- బాపట్ల, మంగళగిరి- తెనాలి -నారా కోడూరు, బేస్తవారిపేట- ఒంగోలు, రాజంపేట - గూడూరు, ప్యాపిలి-బనగానపల్లి, దామాజీపల్లి- తాడిపత్రి, జమ్మలమడుగు -కొలిమిగుండ్ల, సోమందేపల్లి- హిందూపురం- తూముకుంట మధ్య మొత్తం 1,307 కి.మీ మేర పీపీపీ విధానంలో రోడ్లు నిర్మించనున్నారు. నేషనల్ హైవేలలో ఎలా అయితే పీపీపీ పద్ధతికి ప్రజలు ఆమోదం తెలిపారో.... మంచి రోడ్లు అందుబాటులోకి తెస్తే స్టేట్ హైవేల విషయంలో కూడా అటువంటి స్పందనే వస్తుందని సీఎం అన్నారు. అయితే ఈ రోడ్లపై టోల్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం అధికారులకు సూచించారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లతోపాటు ఇంకా ఎవరికి మినహాయింపు ఇవ్వాలనేది కూడా చర్చించాలని చెప్పారు. కేవలం భారీ వాహనాలు, ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు మాత్రమే రుసుము వసూలు చేసే విధానంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులకు సీఎం సూచించారు. ప్రజలపై భారం వేయకుండా... రోడ్ల నిర్మాణ సంస్థలకు వయబులిటీ గ్యాప్ ఫండింగ్ ప్రభుత్వం చెల్లిస్తుందని సీఎం అన్నారు. మంచి రోడ్లు, ప్రజలకు రోడ్డు భద్రత అనేది ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం చంద్రబాబు అన్నారు.

## ఎన్‌డిబి పనులు వేగవంతం

రాష్ట్రంలో న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆర్థిక సాయంతో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని సీఎం సూచించారు. ఈ ప్రాజెక్టు కింద చేపట్టిన ఫేజ్ 1 పనుల్లో 666 కి.మీ మాత్రమే పూర్తియ్యాయని, ఇవి మొత్తం పనుల్లో 26 శాతం మాత్రమేనని అధికారులు వివరించారు. మొదటి ఫేజ్ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చెయ్యాలని సీఎం అధికారులకు సూచించారు. ఇకపోతే రాష్ట్రంలో గ్రామాల్లో ఉన్న అంతర్గత రోడ్ల పరిస్థితిపైనా సీఎం ఆరా తీశారు. గ్రామాల్లో మొత్తం 68వేల కి.మీ ఇంటర్నల్ రోడ్లు ఉన్నాయని... వీటిలో 55వేల కి.మీ సీసీ రోడ్లు ఉన్నాయని తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలోనే 25 వేల కి.మీ మేర సీసీ రోడ్ల నిర్మాణం జరిగిందని...వైసీపీ ప్రభుత్వంలో కేవలం 6వేల కి.మీ మేర మాత్రమే పనులు జరిగాయన్నారు. మిగిలిన సీసీ రోడ్ల పనులను కేంద్రం పంచాయతీలకు ఇచ్చే నిధులు, నరేగా పనుల్లో భాగంగా పూర్తి చెయ్యాలని సీఎం సూచించారు.కేంద్రం తాజాగా మరో రూ.275 కోట్లు పంచాయతీలకు విడుదల చేసిందని.. వాటి ద్వారా కూడా పనులు చేపట్టాలని సీఎం సూచించారు. నాబార్డు నిధుల ద్వారా పంచాయతీ రోడ్లు నిర్మించాలని సీఎం సూచించారు. గ్రామాల నుంచి స్టేట్ హైవేలకు, నేషనల్ హైవేలకు కనెక్టవిటీ పెంచే అంశంపైనా దృష్టిపెట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు.

# సాక్షి ఎడిటర్ వర్ధెల్లి మురళి అబద్ధాల కుతంత్ర రాతలు- 3

24.11.2024 ఆదివారం అవినీతి పత్రిక సాక్షి ఎడిట్ పేజిలో సోలార్ విద్యుత్ కుంభకోణంలో జగన్ ముడుపులు కప్పిపెడుతూ, షరా మామూలుగా చంద్రబాబుపై నిందలు మోపుతూ మురళి సుదీర్ఘ వ్యాసం రాశారు. జగన్‌రెడ్డి వ్యక్తిత్వాన్ని ఎల్లో మీడియా హననం చేస్తున్నదనే మురళీ ఆరోపణ అబద్ధం. వ్యక్తిత్వ హనన పేటెంట్ జగన్ రోత మీడియాదేగాని మరెవ్వరిదీ కాదనేది జగమెరిగిన సత్యం. చిన్నాన్న హంతకుల్ని కాపాడడానికి చిన్నాన్న వ్యక్తిత్వ హనన రాతలు రాసింది సాక్షినే. గొడ్డలి వేటును గుండెపోటుగా ప్రసారం చేసింది సాక్షి ఛానలే. తన కుటుంబీకులు చేయించిన వివేకా హత్యను నారాసుర రక్తచరిత్ర అంటూ పెద్ద అక్షరాలతో చంద్రబాబు వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ అబద్ధాలు రాసింది సాక్షినే. సునీత తన తండ్రిని హత్య చేయించిందనే వికృత రాతలు రాసింది రోత మీడియానే. తల్లి, చెల్లి శీల హననం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన దుర్మార్గుల్ని వెనకేసుకొస్తున్నది, కాపాడుతున్నది మీ అధినేతే కాదా? జగన్ ముఠా చేసిన హత్యలు, వ్యక్తిత్వ హననాలు రాస్తూ పోతే ఒక గ్రంథమే అవుతుంది. తన దుష్ట లక్షణాల్ని చంద్రబాబుకు అంటగట్టి రాసిన అబద్ధమే వందసార్లు రాయించడం జగన్ నైజం. 2004లో రూ.2 కోట్లలోపు ఆస్తివున్న జగన్, నేడు లక్షల కోట్లకు ఎలా ఎగబాకారు? ఈ రేంజ్‌లో పెరిగిన నేత తెలుగు రాష్ట్రాలలో మరెవ్వరూ లేరు ఎందుకు? జగన్ నదమంత్రపు సిరికి దోపిడీ కారణం కాదా? అతనిపై వున్న 38 కేసులు అక్రమమైతే.. కోర్టు వాయిదాలకు హాజరై కొట్టి వేయించుకోవచ్చు కదా? 11 ఏళ్ళ నుండి సీబీఐ కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా ఎందుకు తప్పించుకుంటున్నారు?

సెకీ 2021 జనవరి 30న గుజరాత్ ఊర్జా వికాస్ నిగమ్ లిమిటెడ్‌తో యూనిట్ రూ.1.99 చొప్పున ఒప్పందం చేసుకొన్నది. జగన్ ప్రభుత్వం 2021 డిసెంబర్‌లో యూనిట్ రూ.2.49 చొప్పున కొనుగోలుకు సెకీతో ఎలా ఒప్పందం చేసుకొంటారు? చంద్రబాబు ప్రభుత్వం 2014-19 మధ్య రాయలసీమలో 7 వేల మెగావాట్ల సామర్థ్యంగల విండ్, సోలార్ ప్లాంట్లు స్థాపించి 13 వేలమంది స్థానిక యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించారు. ఆ ప్లాంట్ల స్థాపనవల్ల రైతుల భూమి విలువ పెరిగింది. ప్రభుత్వానికి పన్నులు వచ్చాయి. రాజస్థాన్ సోలార్ అధిక రేట్లకు కొనడం ఒక నష్టమైతే, రాయలసీమ యువతకు ఉద్యోగాలు రాని స్థితి రెండవది. ఇంత నష్టకరమైన లక్ష కోట్ల ఒప్పందం ముడుపులకుకాక మరెందుకు చేసుకొన్నట్లు?

గతంలో చంద్రబాబు ప్రభుత్వం రాయలసీమలో స్థాపించిన సోలార్, విండ్ ఒప్పందాలు 20 ఏళ్లకు చేసుకొంటే విమర్శలు చేసి ఆ పీపీఏలను రద్దు చేసుకొన్న జగన్, సెకీతో 25ఏళ్ళకు ఎందుకు ఒప్పందం చేసుకొన్నారు? చెప్పేదొకటి చేసేదొకటి కాదా? సెకీ ఒప్పందం దాదాపు లక్ష కోట్ల విద్యుత్ ఛార్జీల భారాలకు సంబంధించినది. ఇంత పెద్ద ఒప్పందాన్ని టేబుల్ ఐటెమ్‌గా క్యాబినెట్‌కు పెట్టడమంటే అందులో ముడుపుల కుట్ర లేదా? విద్యుత్ మంత్రి సంతకం కూడా లేకుండా కేబినెట్‌కు ఎందుకు పెట్టారు? సోలార్ విద్యుత్‌ను రూ.2.49కి కొనాలంటూ 2021 సెప్టెంబర్ 15న సెకీ జగన్ ప్రభుత్వానికి లేఖ రాసింది. 2021 సెప్టెంబర్ 16న అంటే ఒక్క రోజు వ్యవధిలోనే కేబినెట్ సమావేశం పెట్టి సెకీ అనుకూల నిర్ణయం వెనుక కుంభకోణం లేకుంటే ఆగమేఘాలపై ఒక్కరోజు వ్యవధిలోనే ఒప్పందానికి అనుకూల తీర్మానం చేయరు కదా? జగన్‌కు స్వీయ ప్రయోజనం లేకుంటే ఈ ప్రజా వ్యతిరేక నిర్ణయం తీసుకొంటారా?

సాగర్ అదానీ ఫోన్ మెసెజ్‌ల ఆధారంగా విద్యుత్ కొనుగోలు ఒప్పందాల కోసం రాష్ట్రాల అధికారులకు లంచాలు ఇచ్చారని ఎఫ్‌బిఐ నేరారోపణ చేసింది. దీనిపై అమెరికా న్యాయ శాఖ అదానీ పరివారానికి నోటీసులిచ్చింది. జగన్ పేరుగానీ, ప్రస్తావనగానీ రిపోర్టులో ఎక్కడా లేదని మురళీ వ్యాసంలో మరో అబద్ధం రాశారు. రాష్ట్ర నెం1తో సహా ఏపీ ఉన్నతాధికారులకు లంచాలు ఇచ్చినట్టు ఎఫ్‌బిఐ రిపోర్టులో పేర్కొన్నారు. నెంబర్ 1.. మే 2019 నుండి జూన్ 2024 వరకు ఏపీలో అధికారంలో ఉన్నట్టు రిపోర్టులో వుంది. గౌతం అదానీ ఏపీ సీఎంను కలిసినట్టుగా కూడా ఎఫ్‌బిఐ రిపోర్టులో పేర్కొన్నారు. ఇంతస్పష్టంగా జగన్ ప్రస్తావనవుంటే, లేదని మురళీ అబద్ధం రాశారు. మొత్తం 2029 కోట్లు లంచాలు చేతులు మారాయి. అందులో ఏపీ రూ.1750 కోట్లు కాగా, మిగిలిన నాలుగు రాష్ట్రాలైన తమిళనాడు, ఒడిస్సా, చత్తీస్‌గఢ్, కాశ్మీర్ పెద్దలకు రూ.279 కోట్లు ముట్టాయి. చంద్రబాబు విద్యుత్ భారాలు మోపాడని, జగన్ విద్యుత్ రంగాన్ని ఉద్ధరించాడని మురళీ మరో అబద్దాన్ని రాశాడు. వాస్తవాన్ని తలక్రిందులు చేశారు. 2014లో చంద్రబాబు అధికారం చేపట్టేనాటికి 22.5 మిలియన్ యూనిట్లు లోటు ఉండేది. 2014-19 మధ్య 10 వేల మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంగల విద్యుత్ ప్లాంట్లు స్థాపించి చంద్రబాబు మిగులు విద్యుత్ జగన్ చేతిలో పెట్టారు. జగన్ ఐదేళ్ల పాలనలో కొత్త విద్యుత్ ప్లాంట్లు స్థాపించలేదు. ఉన్న జన్‌కో ప్లాంట్లలో సరిగా విద్యుదుత్పత్తి చేయలేదు. కమిషన్ల కోసం అధిక ధరలకు ప్రయివేటు విద్యుత్ కొన్నారు. బొగ్గు, విద్యుత్ పరికరాలు ప్రక్క రాష్ట్రాలతో పోలిస్తే రెట్టింపు రేట్లకు కొన్నారు. 9సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారు. కరెంటు కోతలు పెట్టారు. కమిషన్ల కోసం వ్యవసాయ మోటార్లకు మీటర్లుపెట్టి రైతు మెడకు ఉరి వేయబోయాడు. చంద్రబాబు ప్రభుత్వం వ్యవసాయ మోటార్లకు మీటర్లుపెట్టే పథకాన్ని రద్దు చేసింది.

ఈరోజు రాష్ట్రంలో సుమారు 20 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంగల విద్యుత్ ప్లాంట్లు ఉంటే అందులో 15 వేల మెగావాట్లు సామర్థ్యం గల ప్లాంట్లు స్థాపించింది చంద్రబాబు ప్రభుత్వాలే. జగన్ విద్యుత్ రంగంలో 1.29 లక్షల కోట్లు భారాలు మోపినా కొత్తగా ఒక్క విద్యుత్ ప్లాంటు కూడ స్థాపించలేదు. విద్యుత్‌రంగాన్ని దోచుకుతిన్నారు. టీడీపీ హామీల అమలు వైఫల్యం చెందిందని, దాని డైవర్షన్‌కు జగన్‌పై నిందలు చేస్తున్నారని పాచి పాటే మురళీ పాడారు. ప్రతిపక్ష నేతగా జగన్ వైఫల్యం చెందారు. చాక్‌లెట్ కొని ఇవ్వకుంటే బడికెళ్ళనని పిల్లాడు మొండి కేసినట్లు, అర్హతలేకున్నా పదవి ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని వితండ వాదంతో ప్రతిపక్ష నేతగా విఫలమయ్యారు. కుటుంబ పెద్దగా కూడా విఫలమయ్యారు. 2019లో అధికారం చేపట్టిన జగన్ మొదటి 5నెలల్లో అమలు చేసింది రెండు హామీలు మాత్రమే. రూ. 250 ఫించన్ పెంచి, డ్రైవర్లకు రూ.10 వేలు మాత్రమే ఇచ్చారు. మరే నవరత్న హామీ అమలు చేయలేదు. ఖజానా దివాళా తీసివున్నా చంద్రబాబు ఒకేసారి ఫించన్ రూ.1000 పెంచారు. అన్న క్యాంటీన్లు పెట్టారు. ఉచిత గ్యాస్ ఇస్తున్నారు. ఉచిత ఇసుక ఇస్తున్నారు. విషపూరిత మద్యం రద్దు చేసి నాణ్యమైన మద్యం ఇస్తున్నారు. రోడ్లు వేస్తున్నారు. కేంద్రం నుండి విభజన హక్కులు కొన్ని సాధించారు. ఇలా ఐదు నెలల్లోనే 150కి పైగా అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించి ఆదర్శ పాలన చేస్తున్నారు. మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి డైవర్షన్ చేయాల్సిన అవసరం ఎందుకుంటుంది? తన దోపిడీ, నేరాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే దొంగే దొంగ అన్నట్లు డైవర్షన్ అంటూ ఎదురుదాడి చేస్తున్నది జగన్ ముఠానే.



- గురజాల మాల్యాద్రి,
చైర్మన్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

చైతన్యరథం

# ఇక ఏకగవాక్ష విధానం

- డిసెంబరు 31 నుండి సింగిల్ విండో అనుమతులు
- పలు శాఖల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు
- భవనాలు, లేఅవుట్ల అనుమతులు సులభతరం
- కీలక నిర్ణయాన్ని ప్రకటించిన ఏపీ సర్కార్
- 15 మీటర్ల ఎత్తు భవనాలకు ప్లాన్ అనుమతులు అక్కర్లేదు
- టీడీఆర్ అంశాలపై 15 రోజుల్లో పూర్తిస్థాయి సమీక్ష
- అమృత్ 2.0 రెండేళ్లలో పూర్తికి ముఖ్యమంత్రి ఆదేశాలు
- మెప్మా సభ్యుల అభ్యున్నతికి పి4 విధానంలో చర్యలు
- రాజధానిలో త్వరలోనే ఐకానిక్ భవన నిర్మాణాల పనులు
- సీఎం సమీక్షా నిర్ణయాలను ప్రకటించిన మంత్రి నారాయణ



అమరావతి (చైతన్య రథం): భవనాలు, లే అవుట్ల అనుమతులు సులభతరం చేస్తూ ఏపీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. టౌన్ ప్లానింగ్ విభాగంలో సంస్కరణలపై వేసిన కమిటీ రిపోర్ట్‌కు సీఎం ఆమోద ముద్ర వేశారు. 15 మీటర్ల ఎత్తువరకూ భవనాల నిర్మాణాల ప్లాన్‌లకు మున్సిపల్ శాఖ అనుమతి అవసరం లేదు. రాష్ట్రంలో వచ్చేనెల 31నుండి వివిధ భవన నిర్మాణాలకు సంబంధించిన అనుమతులను మరింత సులభతరం చేయడం ద్వారా సింగిల్ విండో (ఏక గవాక్ష) విధానంలో అనుమతులిచ్చేదుంకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి మంత్రి పి నారాయణ వెల్లడించారు. ఈమేరకు సోమవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర మున్సిపల్ శాఖపై సమీక్ష నిర్వహించారని, సమావేశంలో ప్రధానంగా టౌన్ ప్లానింగ్‌కు సంబంధించిన అంశాలపై కీలక సూచనలు చేశారని తెలిపారు. ముఖ్యంగా భవన నిర్మాణాలకు సంబంధించిన వివిధ అనుమతులను వేగవంతంగా సులభంగా ఇచ్చే అంశంపై మున్సిపల్ శాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. వివిధ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న భవన నిర్మాణ అనుమతులు పరిశీలనకై ఏడు కమిటీలను ఏర్పాటు చేయగా, వారు 10 రాష్ట్రాల్లో అధ్యయనం చేసి నివేదిక సమర్పించారని మంత్రి నారాయణ వివరించారు. భవన నిర్మాణ అనుమతులకై నిర్మాణదారులు వివిధ శాఖల అనుమతులకై రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, అగ్నిమాపక శాఖలతోపాటు గనులు, రైల్వే, విమానాశ్రయ ప్రాంతాల సమీపంలో అయితే ఆయా శాఖల చుట్టూ అనుమతులకై తిరిగడం నెలల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేకుండా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా అన్ని అనుమతులు ఒకేచోట సింగిల్ విండో విధానంలో పొందేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఇందుకు సంబంధించి ఆయా శాఖల సర్వర్లను మున్సిపల్ పరిపాలనశాఖ సర్వర్‌తో ఇంటిగ్రేట్ చేయనున్నట్టు తెలిపారు. ఈవిధానం వచ్చేనెల 31నుండి అమలులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి నారాయణ వివరించారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్లు భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన ప్రతిపాదనలను ఆన్‌లైన్‌లో అప్లై చేస్తే అందుకు సంబంధించిన అనుమతులను సకాలంలో మంజూరు చేయడం జరుగుతుందని మంత్రి నారాయణ వెల్లడించారు. ఈ అనుమతులు మంజూరుకు సంబంధించి ఎవరైనా లైసెన్సుడు సర్వేయర్లు అవకతవలకు పాల్పడితే అలాంటి వారి లైసెన్సును రద్దు చేయడంతోపాటు వారిపై చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. దీనిపై ఏర్పాటైన టాస్కుఫోర్సు కూడా ఆన్‌లైన్‌లో నిరంతరం పర్యవేక్షణ చేస్తుందని తెలిపారు.

రాష్ట్రంలో వివిధ లే అవుట్లలో ప్రస్తుతం 12 అడుగుల వరకూ స్థలాన్ని రోడ్డుకు కేటాయించాల్సి ఉందని, అయితే వివిధ రాష్ట్రాల్లో అది 9 అడుగులుగా ఉందని అదే విధానాన్ని రాష్ట్రంలోనూ అనుసరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు మున్సిపల్ మంత్రి నారాయణ చెప్పారు. అదేవిధంగా 500 చదరపు మీటర్లకంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించే వాణిజ్య భవనాలు, నివాస భవనాలకు సంబంధించి సెల్లార్ల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. హైరైజ్ భవనాలకు సంబంధించి సెట్ బ్యాక్ ఏరియా ఎంత ఉండాలనే దానిపైనా స్పష్టమైన అనుమతులు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. టీడీఆర్ బాండ్లకు సంబంధించి కూడా సీయంతో జరిగిన సమావేశంలో చర్చకు రావడం జరిగిదని, దానిపై పూర్తి వివరాలు సేకరించి రావాలని 15 రోజుల్లో మరలా సమీక్షిస్తానని సీయం చెప్పారని అన్నారు. మెప్మాకు సంబంధించి ప్రస్తుతం సుమారు 28లక్షల మంది సభ్యులుగా ఉన్నారని, వారి అభ్యున్నతికి పి-4 విధానంలో రానున్న రోజుల్లో మరిన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో అమృత్ 2.0ను రెండేళ్ళలో పూర్తి చేయాలని సీయం ఆదేశించారని, ఆ ప్రకారం తగిన చర్యలు తీసుకోనున్నట్టు మంత్రి నారాయణ వెల్లడించారు.

అమరావతి రాజధానికి సంబంధించి మంత్రి నారాయణ మాట్లాడుతూ రాజధాని అమరావతి అని పార్లమెంటులో కేంద్రం గతంలోనే స్పష్టంగా చెప్పిందని, కేంద్రం అధికారిక గెజిట్‌ను జారీ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుందని చెప్పారు. ఐదు ఐకానిక్ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు డిజైన్లను నార్మన్ పోస్టర్ సంస్థ గతంలో రూపొందించిందని.. అయితే గత ప్రభుత్వం నార్మన్ పోస్టర్స్ సంస్థ టెండర్‌ను, వారి డిజైన్లను రద్దు చేసిందని గుర్తు చేశారు. అందుకే మళ్లీ ఈ భవనాల డిజైన్ల కోసం టెండర్లు పిలవగా.. ఆ టెండర్లు మరలా నార్మన్ పోస్టర్స్ సంస్థకే వచ్చాయని సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో వాటికి ఆమోదాన్ని ఇవ్వడం జరిగిందని అన్నారు. త్వరలోనే వీటి తుది డిజైన్లకు సంబంధించిన ఉత్తర్వులు ఇస్తామని, గత ప్రభుత్వం ఎలాంటి నోటీసు లేకుండా టెండర్లు రద్దు చేయటంతో నార్మన్ పోస్టర్స్ ఆర్బిట్రేషన్ వేసిందన్నారు. అందుకే అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ కేంద్రంలో వారికి రూ.9 కోట్లు పరిహారం చెల్లించాల్సి వచ్చిందని ఆ కారణంగానే ఇప్పుడు మళ్లీ రీటెండర్ పిలవాల్సి వచ్చిందన్నారు. రాజధాని ప్రాంతంలో నిర్మాణాలకు సంబంధించి పనులు త్వరలోనే మొదలవుతాయని, ప్రపంచబ్యాంకు రుణానికి ఎలాంటి ఇబ్బందీ లేదని.. దశలవారీగా రుణమిచ్చేందుకు ప్రపంచ బ్యాంకు ఇప్పటికే ముందుకు వచ్చిందని మున్సిపల్ మంత్రి పి.నారాయణ వివరించారు.

## విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచేలా పాఠ్యాంశాలు

- మార్గదర్శనం చేయాలని సలహాదారు చాగంటిని కోరిన మంత్రి లోకేష్



అమరావతి (చైతన్యరథం): విద్యార్థి దశ నుండే నైతిక విలువలు పెంచేలా పాఠ్యాంశాలు రూపొందిస్తున్నామని, ఇందుకు తగిన మార్గదర్శనం చేయాలని ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావును రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. విద్యార్థులు, యువతలో నైతిక విలువల పెంపునకు ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు సోమవారం ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. విద్యార్థుల్లో మహిళలు, పెద్దలు, గురువులపై బాల్యం నుంచే గౌరవం పెంపొందించేలా ప్రత్యేకంగా పాఠ్యాంశాలు రూపొందించాలని నిర్ణయించినట్లు మంత్రి లోకేష్ తెలిపారు. ఇందుకు మీ వంటి పెద్దల అమూల్యమైన సలహాలు అవసరమని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, సత్ప్రవర్తన పెంపొందించేందుకు తమ వంతు సలహాలు, సహకారం అందిస్తానని ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరరావు చెప్పారు.

## తగిన విధంగా ప్రోత్సహిస్తాం

- విభిన్న ప్రతిభావంతుడు కామిశెట్టి వెంకట్‌కు మంత్రి లోకేష్ హామీ



అమరావతి (చైతన్యరథం): మానసిక వైకల్యాన్ని జయించి విశేష ప్రతిభా పాటవాలు కనబరుస్తున్న కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కామిశెట్టి వెంకట్ కుటుంబం ఉండవల్లి నివాసంలో సోమవారం మంత్రి నారా లోకేష్‌ను కలిసింది. వెంకట్‌కు ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం అందించాలని తల్లిదండ్రులు కోరారు. వెంకట్ ప్రస్థానాన్ని ఈ సందర్భంగా మంత్రి మెచ్చుకున్నారు. తగిన విధంగా ప్రోత్సహిస్తామని తెలిపారు.

మంత్రి లోకేష్‌ను కలిసేలా అనుగ్రహించాలంటూ..

## మోకాళ్లపై దుర్గగుడి మెట్లెక్కిన యువకుడు

- విషయం తెలిసి ఇంటికి పిలిపించి మాట్లాడిన మంత్రి
- వైసీపీ పాలనలో తీవ్ర వేధింపులు ఎదుర్కొన్న యువకుడు సాయికృష్ణ



అమరావతి (చైతన్యరథం): తనను కలిసేందుకు ఎంతగానో తపిస్తున్న యువకుడిని మంత్రి నారా లోకేష్ స్వయంగా పిలిపించుకుని మాట్లాడారు. వైసీపీ రాక్షస పాలనలో తీవ్ర వేధింపులు ఎదుర్కొన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం చొడవరానికి చెందిన యర్రంశెట్టి సాయికృష్ణ.. కొద్దిరోజులుగా మంత్రి నారా లోకేష్‌ను కలిసేందుకు ప్రయత్నిస్తున్నారు. మంత్రి లోకేష్‌ను కలిసేలా అనుగ్రహించాలంటూ ఈ నెల 8వ తేదీన మోకాళ్లపై కొండ మెట్లెక్కుతూ దుర్గగుడిలో అమ్మవారిని దర్శించుకుని ప్రార్థించారు. అంతే కాకుండా తన ఆకాంక్షను ఎక్స్ ద్వారా తెలియజేయడంతో మంత్రి లోకేష్ తక్షణమే స్పందించారు. ఉండవల్లి నివాసానికి సోమవారం సాయికృష్ణను పిలిపించుకుని మాట్లాడి, ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వైసీపీ పాలనలో అప్పటి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, పిల్లి సుభాష్ చంద్రబోస్ దమనకాండపై ప్లకార్డుల ద్వారా శాంతియుతంగా సాయికృష్ణ నిరసన గళం వినిపించారు. ప్రజాసమస్యలపై కరపత్రాలు పంచాడు. దీంతో వైసీపీ ప్రభుత్వం ఆయన ఇంటికి విద్యుత్ సరఫరాను నిలిపివేసి తీవ్రంగా వేధించింది. సాయికృష్ణ ఉద్యోగం కూడా కోల్పోవాల్సి వచ్చింది. చివరికి ప్రజా ప్రభుత్వం కొలువుదీరడంతో ఆయన కోరిక నెరవేరింది. సాయికృష్ణ పోరాటాన్ని మంత్రి అభినందించారు.

# రాష్ట్రంలో తొలి కంటైనర్ ఆసుపత్రి ప్రారంభం

- గిరిజన గ్రామాలు, కొండ ప్రాంతాల్లో వైద్యసేవలే లక్ష్యం
- అక్కడే ఓపీ సేవలు, మందులు, అన్నిరకాల పరీక్షలు
- డోలీల మోతకు స్వస్తి పలికేలా మౌలిక వసతులు
- గిరిజన, మహిళా శిశు సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణి



పార్వతీపురం(చైతన్యరథం): రాష్ట్రంలోని గిరిజన ప్రజలకు అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని, అందులో భాగంగా తొలి కంటైనర్ ఆసుపత్రిని ప్రారంభించి గిరిజనుల డోలీ మోతలకు స్వస్తి పలికినట్లు గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. సాలూరు మండలం కరడ వలసలో వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాటుచేసిన గిరి ఆరోగ్య కేంద్రాన్ని (కంటైనర్ ఆసుపత్రి) సోమవారం ఉదయం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో తొలి కంటైనర్ ఆసుపత్రిని ప్రాంతీయ ఆరోగ్య సేవల కోసం ప్రారంభించడం జరిగిందని వివరించారు. ప్రాంతీయ గిరిజన గ్రామాలు, కొండ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా దీనిని రూపొందించడం జరిగిందని తెలిపారు. సుమారు 2,000 మంది పక్క గ్రామాలకు చెందిన నివాసితుల ఆరోగ్య అవసరాలను తీర్చడంలో ఇది ముందడుగుగా పేర్కొన్నారు. బెల్లపాక, బొడ్డపాడు, సరింజపాడు, కరడవలస, కరడకోటవలస (సాలూరు మండలం)తో పాటు చాకిరేవువలస, కంకనపల్లి, అజూరు, కుంబివలస (పాచిపెంట మండలం) గ్రామాలకు ఈ సేవలు అందుబాటులో ఉంటా యని వివరించారు. ప్రాథమిక వైద్య సంరక్షణ కోసం గ్రామీణులు చాలా దూరం ప్రయాణించాల్సిన అవసరాన్ని ఇది తగ్గిస్తుందని గుర్తుచేశారు.

### 104 మెడికల్ యూనిట్‌తో వైద్యసేవలు

ఇందులో వారానికి ఒకసారి వైద్యాధికారి ఓపీ సేవలు అందిస్తారని, నెలకు రెండుసార్లు రెండు, నాలుగు బుధవా రాల్లో 104 మొబైల్ మెడికల్ యూనిట్ ఇక్కడికి వస్తుందని చెప్పారు. ఏఎన్ఎం, ఎం.ఎల్.హెచ్.పి వారానికి మూడుసార్లు ఇక్కడ ఓపీ సేవలు నిర్వహిస్తారని తెలిపారు. ఆశా కార్యకర్త ప్రతిరోజూ ఇక్కడ అందుబాటులో ఉంటారని, 105 రకాల మందులు అందుబాటులో ఉంచామని చెప్పారు. రక్తపోటు, మధుమేహానికి సంబంధించిన మందులు ఇక్కడ తీసుకోవచ్చని, అలాగే గర్భిణులకు కూడా సేవలు అందుబాటులో ఉన్నట్లు ఆమె వివరించారు. వారిలో రక్తహీనత కలిగిన వారికి ఐరన్ టాబ్లెట్లు అందుబాటులో ఉంటాయని, వారు ఆసుపత్రికి వెళ్లే అవసరం లేకుండా ఐరన్-ఇంజక్షన్లు ఇక్కడే ఎక్కించే సౌకర్యం కల్పించినట్లు వివరించారు. నెలకు ఒకసారి గర్భిణులకు ఇక్కడ రక్త పరీక్షలు చేయడం జరుగుతుందని తెలిపారు. అంతేకాకుండా మలేరియా,డెంగ్యూ,షుగర్, రక్తశాతం, హెపటైటీస్,హెచ్ఐవీ, నీటి పరీక్షలు,టీబీ-కెల్ల, హెచ్‌వీ, ఐఓడిన్, యూరిన్, హెచ్‌సీజీ- కిట్, కంటి చూపు మొదలైన 14రకాల పరీక్షలు ఇక్కడచేస్తారని వివరించారు. చిన్నపిల్లలకు టీకాలు వేసే కార్యక్రమం ఉంటుందని, ప్రతినెలా రెండో శనివారం సార్వత్రిక రోగనిరోధకత కార్యక్రమం(యూఐపీ) నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు.

### వైద్యసేవలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాకలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో డోలి మోతలకు స్వస్తి పలికి వారికి అందుబాటులో వైద్య సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో గిరి ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. ఇక్కడ అన్ని రకాల పరీక్షలు చేయడమే కాకుండా మందులు ఇస్తారని తెలిపారు. గిరి ప్రాంతాల్లో ముఖ్యంగా రక్తహీనత లోపం ఉందని, ఇందుకోసం ఎనీమియా యాక్షన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కమిటీ 15 రోజులకు ఒకసారి ఇక్కడ సమీక్షించుకుని గర్భిణులు, బాలింతలకు, ఐదేళ్ల లోపు పిల్లలకు ఆరోగ్యం, పోషణ గురించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కౌమార దశలో ఉన్న బాల బాలికలకు ప్రత్యేక ఆరోగ్య సదస్సులు, ట్యూబర్క్యులోసిస్ గురించి అవగాహన సదస్సులు జరుగుతాయని వివరించారు. స్వయం సహాయక బృందం సభ్యుల సమీక్షలు, వయోజన విద్య అవగాహన సదస్సులు జరుగుతాయన్నారు. వీటితో పాటు గర్భధారణ, ప్రసవ సమయంలో శ్రద్ధ తీసుకోవడం, నవజాత శిశువు, శిశు ఆరోగ్య సేవలు ఇక్కడ లభిస్తాయన్నారు. బాల్య, వయోపరితుల ఆరోగ్య సంరక్షణ సేవలు, కుటుంబ సంకల్పం, నిరోధక సేవలు, ఇతర ప్రధాన ఆరోగ్య సేవలు, సంక్రమణ వ్యాధులు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, సాధారణ ఔట్ పేషెంట్ సేవల్లో భాగంగా తేలికపాటి వ్యాధులకు చికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు. సాధారణ కంటి, చెవి, ముక్కు, గొంతు సమస్యలకు చికిత్స, ప్రాథమిక దంత ఆరోగ్య సంరక్షణ సేవలు, వృద్ధుల, పాలియేటివ్ ఆరోగ్య సేవలు, అతి తీవ్రగాయాలు, ఇతర అత్యవసర వైద్యసేవలు, మానసిక ఆరోగ్య సమస్యల స్క్రీనింగ్, ప్రాథమిక నిర్వహణ కూడా ఉంటుందని వివరించారు. ఈ సేవలను గిరి ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కె.విజయపార్వతి,వైద్య ఆరోగ్యశాఖ నోడల్ అధికారి ఎం.వినోద్, వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహన్‌రావు, వైద్య సిబ్బంది, జిల్లా అధికారులు పాల్గొన్నారు.






## గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్ నిర్మాణంలో..

# యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

- తక్షణం చర్యలు తీసుకోవాలి
- పీసీబీకి ఎమ్మెల్యే ధూళిపాళ్ల ఫిర్యాదు




విజయవాడ (చైతన్యరథం): చట్టపరమైన అన్ని నిబంధనలను ఉల్లంఘించి గుంటూరులో గ్రీన్‌గ్రేస్ పేరిట హైరైజ్ అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారని, తక్షణం చర్యలు తీసుకోవాలని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు విజయవాడలోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గుంటూరులోని బజరంగ్ జూట్ మిల్లు ప్రాంగణంలో నిబంధనలకు విరుద్ధంగా గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్ భవనాలను నిర్మిస్తున్నారన్నారు. ఈ నిర్మాణంలో చట్టపరమైన ఉల్లంఘనలను పీసీబీ దృష్టికి తీసుకువెళ్లానని చెప్పారు. నిర్మాణంలో నిబంధనల ఉల్లంఘనపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేశానని తెలిపారు. పీసీబీ నుంచి అనుమతి తీసుకోకుండా ఈ భారీ ప్రాజెక్టును ప్రారంభించారు. ఉల్లంఘనలు జరిగితే నిర్మాణాన్ని నిలుపుచేసే అధికారం పీసీబీకి ఉంటుంది. రైల్వే, వాటర్, ఫైర్ నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా నిర్మాణం జరిపారు. గతంలో క్షేత్రస్థాయి తనిఖీలు లేకుండా కళ్లు మూసుకుని ఐపీఎస్ అధికారులు సంజయ్, మాదిరెడ్డి ప్రతాప్‌లు ఈ భవనానికి ఎన్‌వోసీలు ఇచ్చారు. చట్టపరమైన తీవ్ర ఉల్లంఘనలు ఉన్నందున అపార్టుమెంట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పీసీబీని కోరాను. అనుమతులు లేకుండా నిర్మిస్తూ, మధ్య తరగతి ప్రజల నుంచి భారీగా డబ్బు వసూలు చేశారు. గత ఐదేళ్లలో ఒక్క అధికారి కూడా ఈ ఉల్లంఘనలను పట్టించుకోలేదు. అటువైపు కన్నెత్తి చూడలేదు. తన అన్న, మంత్రి అంబటి రాంబాబు అండ చూసుకుని భవన యజమాని పలు అక్రమాలకు పాల్పడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న భారీ అపార్టుమెంట్ భవనాల నిర్మాణంపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ల కోరారు.

## ఆందోళన వద్దు, అండగా ఉంటాం

- రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు మంత్రి భరత్ భరోసా
- గాయపడ్డవారికి చికిత్స ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని హామీ

అనంతపురం(చైతన్యరథం): అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం తలగాసిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఇటీవల బస్సు - ఆటో ఢీకొన్న ప్రమాద ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు,గాయపడి చికిత్స పొందుతున్నవారికి ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖల మంత్రి టీజీ భరత్ భరోసా ఇచ్చారు. ఆదివారం అనంతపురం నగరంలోని కిమ్స్ సవేరా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను, వారి కుటుంబ సభ్యులను మంత్రి భరత్ పరామర్శించారు. ఆందోళన వద్దని ధైర్యం చెప్పారు. వారికి అందుతున్న వైద్యసేవలపై వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు. చికిత్స ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. అనంతరం ప్రమాదంతో మృతిచెందిన వారి కుటుంబాలను ఓదార్చారు. ఆ కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ పి.జగదీష్, తదితరులు పాల్గొన్నారు.



చైతన్యరథం

# గోపిరెడ్డి అండతో ఆలయ సామగ్రి దోచారు

- నిందితుడినే ఆలయ ట్రస్టీగా నియమించారు
- న్యాయ విచారణ జరిపించి తొలగించాలి
- నరసరావుపేటకు చెందిన వ్యక్తి ఫిర్యాదు
- భూ అక్రమాలపై పలువురు బాధితుల మొర
- గత ప్రభుత్వం ఫీజు చెల్లించలేదని విద్యార్థిని గోడు
- పోలీసుల వల్లే కొడుకు చనిపోయాడని తల్లి ఆవేదన
- ప్రజా వినతుల కార్యక్రమానికి తరలివచ్చిన అర్జీదారులు



మంగళగిరి(చైతన్యరథం): ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్, రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలి చైర్‌పర్సన్ పీతల సుజాత, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు రిష్వం శ్‌లు అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు.

– నరసరావుపేట పట్టణం స్టేషన్ రోడ్డులో ఉన్న ప్రసన్నాంజనేయస్వామి గుడిలో గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అండదండలతో ధ్వజస్తంభం, దానికి సంబంధించిన ఇత్తడి సామగ్రిని దొంగిలించి అమ్ముకున్న వ్యక్తులపై జ్యుడీషియల్ ఎంక్వైరీ వేయాలని పట్టణా నికి చెందిన నూలం రమేష్ ఫిర్యాదు చేశారు. సామగ్రి కొట్టేసిన అక్రమార్కుడిని ఆలయ ట్రస్టీగా నియమించారని అతడిని తొలగించాలని కోరారు.

– జగన్ ప్రభుత్వంలో రీ సర్వే జరిగినప్పుడు అధికారులకు లంచం ఇచ్చి దొంగ పాస్ పుస్తకాలు చేయించుకుని తమ వారసత్వ భూమిని కె.నాగేష్ నాయక్ అనే వ్యక్తి అతని పేరుపై ఆన్‌లైన్ చేయించుకున్నాడని నంద్యాల జిల్లా పాములపాడు మండలం భానుముక్కల గ్రామానికి చెందిన చిన్న నాగన్న ఫిర్యాదు చేశాడు. ఆ భూమి వంద సంవత్సరాల నుంచి తమ ఆధీనంలో ఉందని..అధికారులు విచారించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నాడు.

– టీడీపీలో తిరుగుతున్నానని తనపై వైసీపీ నాయకులు అక్రమ కేసులు పెట్టారని... వాటిని తొలగించేలా చూసి తనకుఉపాధి కల్పించాలని నంద్యాల జిల్లా ప్యాపిలికిచెందిన రాంగోపాల్‌రెడ్డి వినతిపత్రం అందజేశాడు.

– డబ్బులు తీసుకుని అక్రమంగా రికార్డులు మార్చిన వీఆర్వోపై చర్యలు తీసుకుని తమ భూమి తమకు దక్కేలా చూడాలని కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం మల్లవ రం గ్రామానికి చెందిన యొన్ముల చిట్టెమ్మ వేడుకుంది.

– హాసిని అనే అమ్మాయి కనిపించకపోవడంతో తన కొడుకు(19)ను స్టేషన్‌కు తీసుకెళ్లి దారుణంగా కొట్టడంతో చనిపోయాడని విశాఖపట్నం తిక్కవాని పాలెంకు చెందిన యశోద కన్నీటిపర్యంతమైంది. తన కొడుకు చావుకు కారణమైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని వేడుకుంది.

– దాసరి రామయ్య అనే వ్యక్తి పంచాయతీ రోడ్డుకు కర్రలను అడ్డంగా కట్టి ప్రజల ను రోడ్డుపై తిరగనివ్వకుండా ఇబ్బందికి గురిచేస్తున్నాడని... ఆయనపై చర్యలు తీసుకుని కర్రలను తొలగించాలని కృష్ణా జిల్లా కోదూరు మండలం లింగారెడ్డిపాలెం దళితవాడకు చెందిన పలువురు విజ్ఞప్తి చేశారు.

– తాను భీమవరంలోని బీవీ కాలేజ్‌లో ఎంపీఏ పూర్తి చేశా... గత ప్రభుత్వం తనకు చెల్లించాల్సిన ఫీజు చెల్లించకపోవడంతో తన సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన ఇజ్జపురెడ్డి తేజో సౌందర్యవాణి ఫిర్యాదు చేసింది. దయచేసి తన సర్టిఫికెట్లు ఇప్పించాలని వేడుకుంది.

– గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ కింద పశువులకు మినీ గోకులం పథకంలో భాగంగా తాను రేకుల షెడ్ నిర్మించుకుంటే ఇంతవరకు ఎటువంటి బిల్లు రాలేదని ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలానికి చెందిన చిన్న వెంకటరెడ్డి తెలిపారు.తనకు బిల్లు మంజూరు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు. అలాగే తమ చెరువులో చిల్ల చెట్లు పెరగడం వల్ల పందులు వచ్చి సమీప పంట పొలాలను నాశనం చేస్తున్నాయని.. చెరువులోని చిల్లచెట్లను తొలగించాలని విజ్ఞప్తి చేశాడు.





## నేడు రాష్ట్ర వ్యాప్తంగా 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

**- సచివాలయంలో కార్యక్రమానికి సీఎం చంద్రబాబు**

అమరావతి (చైతన్యరథం): ఈనెల 26న రాష్ట్ర వ్యాప్తంగా 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 1950 నవంబరు 26 నుండి భారత రాజ్యాంగం అమలులోకి రాగా, ఈ నెల 26వ తేదీకి 75 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు అన్ని శాఖల కార్యదర్శులు, శాఖాధిపతులు, అన్ని జిల్లాల కలెక్టర్లకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి (రాజకీయ) ఎస్.సురేష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ వేడుకల్లో భాగంగా భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న, బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడంతోపాటు కార్యక్రమంలో పాల్గొన్న వారితో రాజ్యాంగ పీఠికను చదివించాలని సూచించారు.

అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంగళవారం ఉదయం 11.30 గం.లకు జరిగే రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సహా పలువురు మంత్రులు, అధికారులు తదితరులు పాల్గొంటారు.

అలాగే జిల్లాల్లో కలెక్టర్ల నేతృత్వంలో 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను జిల్లా మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు సమక్షంలో ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోను 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

## ఆర్జీవీ అరెస్ట్‌కు రంగం సిద్ధం

- రెండోసారీ విచారణకు గైర్హాజర్
- హైదరాబాద్ చేరుకున్న ఒంగోలు పోలీసులు



హైదరాబాద్ (చైతన్యరథం): వివాదాస్పద దర్శకుడు రాంగోపాల్‌వర్మ(ఆర్జీవీ) అరెస్టు రంగం సిద్ధమైంది. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన ఇంటికి ఏపీలోని ఒంగోలు పోలీసులు చేరుకున్నారు. ఆర్జీవీ సోమవారం ఒంగోలు రూరల్ పీఎస్‌లో విచారణకు వెళ్లాల్సి ఉంది. ఆయన హాజరుకాకపోవడంతో అరెస్ట్ చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు 'వ్యూహం' సినిమా ప్రమోషన్ సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ వ్యక్తిత్వాలను కించపరిచేలా సామాజిక మాధ్యమాల వేదికగా రాంగోపాల్ వర్మ పోస్టులు పెట్టారంటూ ప్రకాశం జిల్లా మద్దిపాడు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి రామలింగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా వర్మపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈ కేసులో అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలంటూ ఏపీ హైకోర్టును ఆర్జీవీ ఆశ్రయించగా ఆయనకు చుక్కెదురైంది. అరెస్ట్ నుంచి రక్షణ కల్పించలేమని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈనెల 19న విచారణకు హాజరు కావాల్సి ఉండగా..తనకు 4 రోజుల సమయం కావాలంటూ రాంగోపాల్‌వర్మ అదేరోజు వాట్సాప్‌లో ఒంగోలు పోలీసులకు సమాచారం పంపారు. అనంతరం 25న ఉదయం విచారణకు హాజరుకావాలంటూ మరోసారి ఆర్జీవీకి పోలీసులు నోటీసులు పంపారు. గడువు ముగిసినా విచారణకు హాజరుకాకపోవడంతో అరెస్ట్ చేసేందుకు ఆయన నివాసానికి పోలీసులు వెళ్లారు.

ఆర్జీవీ హైదరాబాద్‌లో లేరని.. సినిమా షూటింగ్‌ల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉన్నట్లు ఇంటివద్ద ఉన్న సిబ్బంది పోలీసులకు తెలిపారు. మరోవైపు ఆయన తరపు న్యాయవాది మీడియాతో మాట్లాడుతూ విచారణకు సహకరిస్తామని.. కొద్దిరోజుల సమయం కావాలని పోలీసులను కోరినట్లు తెలిపారు. సినిమా పనుల్లో భాగంగా రాంగోపాల్ వర్మ వేరే ప్రాంతంలో ఉండటంతో వర్చువల్‌గా విచారణకు హాజరయ్యేందుకు అనుమతి కోరినట్లు చెప్పారు. రెండోసారి కూడా విచారణకు హాజరుకాకపోవడంతో అరెస్ట్ చేసేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో కోయంబత్తూరు, ముంబయికి రెండు బృందాలు వెళ్లాయి. అయితే ఆర్జీవీ సోషల్ మీడియా ఖాతాల హ్యాండిల్స్ లోకేషన్ హైదరాబాద్ పరిధిలోనే చూపిస్తున్నాయి. నగర శివార్లలో సన్నిహితులకు చెందిన ఫాంహౌస్‌ల్లో ఆర్జీవీ ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

## ఐపీఎల్ వేలంలో సరికొత్త చరిత్ర

**13 ఏళ్ల బుడతడికి రూ.1.1 కోట్లు**

అత్యంత పిన్న వయసులో ఐపీఎల్ వేలంలో అమ్ముడుపోయి 13 ఏళ్ల బుడతడు చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్ వేలంలో నిలిచిన వైభవ్ సూర్యవంశీ (13) మెగా వేలంలో మంచి ధర పలికాడు. అతని కనీస ధర రూ.30 లక్షలు కాగా.. రాజస్థాన్ రాయల్స్ అతడిని రూ.1.10 కోట్లకు తీసుకుంది. ఎడమ చేతివాటం కలిగిన వైభవ్ బ్యాటింగ్, బౌలింగ్ లోనూ రాణించగలడు. 2024లోనే ఫస్ట్‌క్లాస్ క్రికెట్లో లోకి అడుగు పెట్టిన వైభవ్ ఐదు మ్యాచ్‌లు ఆడాడు. ఓపెనర్ అయిన వైభవ్ దూకుడుగా ఆడటంలో నేర్పరి. ఫీల్డింగ్ సెటప్‌లో గ్యాప్‌ల్లోకి అలవోకగా బౌండరీలు బాదేస్తాడు.



బీహార్లోని తాజ్‌పూర్ గ్రామానికి చెందిన వైభవ్ సూర్యవంశీ 2011లో జన్మించాడు. నాలుగేళ్ల వయసులోనే బ్యాట్ పట్టిన అతడి ఆసక్తిని చూసిన తండ్రి సంజీవ్ సూర్యవంశీ ప్రత్యేకంగా మైదానాన్ని తయారు చేయించాడు. మరో నాలుగేళ్లకే సమస్తిపూర్‌లోని క్రికెట్ అకాడమీలో చేర్పించాడు. రెండేళ్లపాటు శిక్షణ పొందిన అతడు అండర్ -16 జట్టులోకి వచ్చేశాడు. అప్పటికి వైభవ్ వయసు కేవలం 10 ఏళ్లే కావడం గమనార్హం. 2024లోనే ఫస్ట్ క్లాస్ క్రికెట్లోకి అడుగుపెట్టిన వైభవ్ తాజాగా ఐపీఎల్ వేలంలో రూ.1.10కోట్లకు రాజస్థాన్ రాయల్స్ సొంతమయ్యాడు.

# అవినీతికి అగ్రజుడు.. జగన్!

జనం కడుపుగొట్టి తన పొట్ట నింపుకోవడంలో చరిత్రకెక్కిన జగన్‌రెడ్డి అంతూ పొంతూలేని అత్యాశ యావద్భారతానికే తలవంపులు తెచ్చింది. సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందాల మాటున రూ.1750 కోట్లు మేతమేసిన జగత్ కంత్రి సాగించిన ముడుపుల బాగోతాన్ని అమెరికా దర్యాప్తు సంస్థ వెలుగులోకి తెచ్చింది. అవినీతి గడ్డిమేసి అధిక ధరలకు అదానీ కరెంటు కొనుగోలుకు ఒప్పందం చేసుకొన్న జగన్‌రెడ్డి మూలంగా ప్రజల నడ్డి విరిగిన అదనపు భారం.. అక్షరాలా రూ.1.10 లక్షల కోట్లు. ఆర్థిక నేరాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా పేరుమోసిన జగన్‌మీద ఇప్పటికే 11 సీబీఐ కేసులు, 9 ఈడీ కేసులున్నాయి. రూ.43వేల కోట్ల అక్రమాస్తులను జగన్ పోగేశారని దర్యాప్తు సంస్థలే నిగ్గుతేల్చాయి. అయినా ఆ కేసులపై విచారణలే దశాబ్దకాలంగా దేకుతున్నాయి. ఇప్పుడు జగన్ ముడుపుల లోగుట్టును అమెరికా యంత్రాంగం రట్టుచేసిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం జగన్‌రెడ్డిపై చర్యలకు ఉపక్రమించాలి. వైసీపీ హయాంలో కుదిరిన అన్ని ఒప్పందాలపై సమగ్ర విచారణ జరగాలి. జ్యూడీషియల్ కమిషన్లను ఏర్పాటుచేసి జగత్‌కంత్రి వికృత అవినీతిని బట్టబయలు చేసి కఠినంగా శిక్షించాలి. అంతర్జాతీయ అవినీతి పరుడిగా చరిత్రకెక్కిన ఘనుడు జగన్‌రెడ్డి. భారీ లంచం భోంచేసి 25 ఏళ్లపాటు రాష్ట్ర ఖజానాకు బొర్రెపెట్టి అదానీకి అప్పనంగా కట్టబెట్టిన అవినీతి బాగోతాన్ని బట్టబయలు చేయాలి. మోసానికి అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ సీయం జగన్‌రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని ప్రజలూ కోరుకుంటున్నారు. వ్యక్తిగత లాభం కోసం ఉద్దేశపూర్వకంగా అవినీతికి పాల్పడిన ఆర్థిక నేరగాళ్లను కఠినంగా శిక్షించకపోతే మొత్తం సమాజమే అన్యాయమైపోతుందని సాక్షాత్తూ సుప్రీంకోర్టే స్పష్టంచేసింది. లోతైన కుట్రలతో కూడిన ఆర్థిక నేరాలు దేశార్థికానికి ప్రమాదకరమైనవని, వాటిని తీవ్రంగా పరిగణించాలని జగన్మోహన్‌రెడ్డి కేసులోనే సుప్రీమ్ కోర్టు పదేళ్ల క్రితమే వ్యాఖ్యానించింది.

రద్దీగావున్న బస్సుల్లో తక్కుర్తిపడి ఒక జేబుదొంగ ఒకరి పర్సు కొట్టేస్తాడు. తోటి ప్రయాణికులకు ఆ విషయం తెలియగానే ఆగ్రహం వ్యక్తంచేస్తూ అతణ్ని పట్టుకుని చావబాది పోలీసులకు అప్పగిస్తారు. అట్లాగే దారిన వెళ్తున్న మహిళ మెడలో పుస్తెలతాడును లాక్కునిపోతాడు మరొకడు. దొరికితే అతడిని పట్టుకుని కాళ్లూ చేతులు విరగ్గొట్టి పోలీస్ స్టేషన్‌కి ఈడ్చు కెళతారు. దర్యాప్తు వ్యవస్థలు కూడా ఇటువంటి జేబు దొంగలపైనే తమ వీర ప్రతాపం చూపిస్తాయి. కానీ ప్రజలకు అబద్ధాలు చెబుతూ వారి డబ్బు వివిధ రూపాల్లో కోటానుకోట్లు దోచేస్తున్న నేతలను మాత్రం దండించడం వదిలేసి.. బందిపోటు దొంగలకు వంగివంగి దండాలు పెడుతూ పూలదండలు వేస్తున్నారు. అవినీతి అనేది తన జన్మహక్కుగా భావిస్తున్నారు జగన్‌రెడ్డి. అవినీతి ఆయనకీ అలవాటైపోయింది. అవినీతి ద్వారా అక్రమాస్తులు పోగేయడంలో ప్రపంచానికే ఆదర్శపురుషుడుగా వర్ధిల్లుతున్నాడు. అవినీతిద్వారా జనం సొమ్మును, జాతివనరులను గంపగుత్తగా దిగమింగి అరాయించుకోవడంలో జగన్‌రెడ్డి ఆయనకు ఆయనే సాటి. నేరమయ రాజకీయాల పుణ్యమా అని అవినీతి భారత గాథలో కళ్లు బైర్లుకమ్మించే అరాచక ఘట్టాలతో ప్రజాస్వామ్యం పుచ్చి పురుగులు పడి లుక లుక లాడుతున్నా ఎవరికీ పట్టడం లేదు.

సౌర విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలలో అవినీతి జరిగిందని ఆంధ్రప్రదేశ్‌నుంచి అమెరికా వరకు చర్చ జరుగుతుంటే, కేసు నమోదై రచ్చవుతున్నా జగన్‌రెడ్డి మాత్రం ఇంకా బుకాయిస్తూ తన ముడుపుల బాగోతంపై పరదాలు కప్పే ప్రయత్నం చేస్తున్నారు. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా -సెకీతో ఒప్పందం చేసుకుంటే అదానీకి ఏం సంబంధమంటూ జగన్‌రెడ్డి, ఆయన వంది మాగధులు అడ్డంగా వాదిస్తున్నారు. కానీ సౌర విద్యుత్తు కొనుగోలుపై అడ్డంగా దొరికిపోయినా నిజాలు దాచేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటు. జగన్‌రెడ్డి దీనికి ముందు సమాధానం చెప్పాలి. సెకీతో ఒప్పందానికి ముందు పనిగట్టుకుని ప్రత్యేక విమానంలో తాడేపల్లికి మూడుసార్లు అదానీవచ్చి తనని ఎందుకు కలిశారు? ఒకవేళ విద్యుత్తు ఒప్పందం కోసం కాదని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అదానీ వచ్చారని అనుకున్నా.. ఆ విషయాన్ని జగన్ ఎందుకు బహిర్గతం చేయలేదు ఆనాడు? ప్రపంచ కుబేరుల్లో ఒకరుగా పేరున్న అదానీ మూడు నెలల్లో మూడు సార్లు రహస్యంగా కలవాల్సిన అవసర మేమిటి? పంప్డ్ స్టోరేజీ, డేటా సెంటర్‌ను అదానీ ఏర్పాటు చేస్తున్నట్టు ఆనాడు సీయం కార్యాలయం అధికారి కంగా ఎందుకు ప్రకటించలేదు? ఆ భేటీల వెనుక మర్మమేంటి? అమెరికా దర్యాప్తు సంస్థలు ఆ సందేహాలను నివృత్తి చేస్తూ స్కాముల కోసం స్కీమ్‌లకు స్కెచ్‌వేసి రాష్ట్రంపై లక్షల కోట్ల రూపాయల సోలార్ ఒప్పంద భారాన్ని జగన్ వేశారంటూ న్యూయార్క్ కోర్టులో అభియోగం మోపింది. జగన్- అదానీ ముడుపుల వ్యవహారం, ఇది నచ్చిక విద్యుత్ సరఫరా ఒప్పందం నుంచి అజూర్ వైదొలగడం గురించి అభియోగపత్రంలో పేర్కొన్నది. జగన్ ముడుపుల బాగోతం కళ్లకు కనిపిస్తున్నా అబద్దాలు చెప్పడం, బుకాయించడం జగన్‌రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య.

అదానీ గ్రూప్ ముట్టచెప్పిన ముడుపుల మొత్తం రూ 2,029 కోట్లలో మాజీ సీయం జగన్‌రెడ్డికే రూ.1,750 కోట్లు ముట్టినట్లు సమాచారం. జగత్ కంత్రి ప్రభుత్వం.. సెకీ ద్వారా 7వేల మెగావాట్ల అదానీ విద్యుత్తు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఒక్కో మెగావాట్‌కు రూ.25 లక్షల చొప్పున 7వేల మెగావాట్లకు రూ.1,750 కోట్లు ఇచ్చినట్టు అమెరికా దర్యాప్తు సంస్థలు బయట పెట్టాయి. 2016లో అదానీ గ్రీన్‌కు ఒకే ఒక్క విద్యుదుత్పత్తి ప్లాంట్ వుండేది అదీ 20 మెగావాట్ల సామర్థ్యంతో ఉండేది. 2018నాటికి రెండువేల మెగావాట్ల సామర్థ్యానికి విస్తరించాలని అదానీ గ్రూప్ లక్ష్యంగా పెట్టుకుని అందుకు 2020లో సెకీతో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రపంచంలోనే అత్యంత భారీ సౌర విద్యుత్తు టెండరు తమకు దక్కిందని, 2025నాటికి 25వేల మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని అదానీ గ్రీన్ సంస్థ 2020 జూన్‌లో ఒక ప్రకటన విడుదల చేసింది. కానీ సెకీకి టెండరు దక్కినప్పటికీ విద్యుత్ కొనుగోలుకు రాష్ట్రాల డిస్కమ్‌లు ముందుకు రాకపోవడంతో అదానీపై ఒత్తిడి పెరిగి ఆయా రాష్ట్రాలకు ముడుపులు ఎరవేసింది. ఆ సమయంలోనే అప్పుడు సీయంగా వున్న జగన్‌రెడ్డిని అదానీ వ్యక్తిగతంగా కలిశారు. ఆ తర్వాతే ఏడువేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు ఏపీతో ఒప్పందం కుదిరిందని అమెరికా దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డికి రూ.1750 కోట్లు ముడుపులు ముట్టజెప్పడం ద్వారా అదానీ కంపెనీ లబ్ధిపొందినట్టు అమెరికాలోని న్యూయార్క్ ఈస్టర్న్ జిల్లా కోర్టులో కేసు నమోదు కావడమంటే జగన్‌రెడ్డి అవినీతి ఎంత తారాస్థాయికి చేరిందో ప్రజలు అర్థం చేసుకోవాలి. క్విడ్ ప్రోకో పద్ధతిలో జగన్‌రెడ్డి అదానితో లాలూచీపడి పోర్టులు, విద్యుత్ ఒప్పందాలు చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అదానీకి అప్పనంగా కట్టబెట్టేందుకు జగన్‌రెడ్డి చీకటి ఒప్పందాలు చేసుకొన్నారు. అదానీతో చేసుకున్న చీకటి ఒప్పందాల వల్ల డిసెంబర్ నుండి రాష్ట్ర ప్రజలు రూ.6072 కోట్ల విద్యుత్ భారాలు మోయాల్సిన పరిస్థితి దాపురించింది. మరో రూ.11,820 కోట్లను విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారం వేయాల్సిన పరిస్థితి. ఒకపక్క చార్జీలు, పన్నుల భారాలు ప్రజలు మోస్తుంటే, అవినీతికి పాల్పడి అదానికి దాసోహమైన జగన్‌రెడ్డి మరోవైపు విద్యుత్తు చార్జీలు పెంచుతున్నారని మొసలి కన్నీరు కారుస్తూ ప్రజలను మభ్యపెడుతూ కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు.

జగన్‌రెడ్డి అవినీతి, అదానీ అత్యాశ ఆంధ్రప్రదేశ్ పరువు తీశాయి. జగన్‌రెడ్డి -అదానీ స్వార్ధ ప్రయోజనాలకు రాష్ట్రం ఆర్థికంగా బలైపోయే పరిస్థితి ఏర్పడింది. అడ్డదారిలో అదానీకి మేలు చేయడానికి జగన్ సర్కారు అన్ని అడ్డదారులూ తొక్కింది. కేవలం అదానీకి మేలు చేసి తానూ ఆర్థిక ప్రయోజనం పొందడం కోసం ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీజీఈసీఎల్) పిలిచిన 10,000 మెగావాట్ల టెండర్లను రద్దు చేసారు. రైతాంగానికి పగటిపూట తొమ్మిది గంటల ఉచిత విద్యుత్తు పథకాన్ని అమలు చేసేందుకు వీలుగా సోలార్ విద్యుత్తు సేకరించేందుకు ఏపీజీఈసీఎల్ 2021లో టెండర్లు పిలిచింది. యూనిట్‌ను రూ.2.49 ధరకు ఇచ్చేందుకు సోలార్ ఉత్పత్తి సంస్థలు ముందు కొచ్చాయి. అప్పట్లో దేశీయంగా సోలార్ విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.2.92గా ఉంది. ఏపీజీఈసీఎల్ పిలిచిన టెండర్‌కు స్పందిస్తూ సోలార్ సంస్థలు యూనిట్‌ను రూ.2.49కు ఇస్తామనడం అప్పట్లో జాతీయ స్థాయిలో చర్చ జరిగింది. జగన్‌కి చిత్తశుద్ధివుంటే వెంటనే కొనుగోలు ఒప్పందాలు చేసుకునే వారు. అలాకాకుండా అదానీకి దోచిపెట్టడానికి స్కెచ్ వేశారు. మేం సెకీతో ఒప్పందం చేసుకున్నాం. సెకీతో రాష్ట్ర ఇంధన సంస్థలు కొనుగోలు ఒప్పందాలు చేసుకుంటే అదానీ ప్రస్తావన ఎందుకు వస్తుందని జగన్ అమాయకంగా ప్రశ్నిస్తు ప్రజలను తప్పు దారి పట్టిస్తున్నారు. కావునా అధికారాన్ని అడ్డం పెట్టుకొని జగన్ సృష్టించిన అవినీతికి యావత్ ఆంధ్రప్రదేశ్ బలైంది. స్వాహాపర్వాలతో రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసిన జగన్‌రెడ్డిని చట్టబద్దంగా శిక్షించాలి. పాలకులం కాదు, సేవకులమంటూ నంగనాచి తనాన్ని అభినయించి లక్షల కోట్ల ప్రజాధనం బొక్కెందుకే అధికారాన్ని ఉపయోగించారు. ప్రజా ప్రయోజనాలు నెరవేర్చాల్సిన ప్రభుత్వ యంత్రాంగాన్ని తన రాజకీయ,ఆర్థిక ప్రయోజనాలు నెరవేర్చడానికి ఉపయోగించిన జగన్‌రెడ్డిపై సమగ్ర విచారణ జరిపించి, కఠినంగా శిక్షించాల్సి వుంది.

- నీరుకొండ ప్రసాద్



ప్రతిష్టాత్మక వీఎంఆర్డీఏ చైర్మన్ బాధ్యతలు చేపట్టడానికి సామాన్య కార్యకర్తలా విశాఖ వీధుల్లో సైకిల్ తొక్కుకుంటూ కార్యాలయానికి వచ్చిన ఎంపీ ప్రణవ్ గోపాల్

## వైకుంఠ ఏకాదశికి తిరుమలలో పకడ్బందీ ఏర్పాట్లు

- **జనవరి 10 నుంచి 19 వరకు ఉత్తరద్వార దర్శనం**
- **వీఐపీ బ్రేక్ (ప్రోటోకాల్ వీఐపీలు మినహా) దర్శనాలు, ఆర్జిత సేవలు రద్దు**
- **అధికారులతో అడిషనల్ ఈవో సమీక్ష**



తిరుమల (చైతన్యరథం): తిరుమలలో వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులకు ఇబ్బంది లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసేందుకు టీటీడీ సమాయత్తమవుతోంది. వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై టీటీడీ అడిషనల్ ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి సోమవారం మధ్యాహ్నం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. వచ్చే జనవరి 10న వైకుంఠ ఏకాదశి ఉండటంతో, 10 నుంచి 19వ తేదీ వరకు 10 రోజుల పాటు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాలను టీటీడీ కల్పించనుంది. ఇందుకు నలభై రోజులు మాత్రమే సమయం ఉండటంతో ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేసుకోవాలని ఆయా శాఖల అధికారులను అడిషనల్ ఈఓ ఆదేశించారు. పది రోజుల వైకుంఠ ద్వార దర్శనాల్లో సాధారణ భక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. సాధారణ భక్తులకు ఎక్కువ దర్శన సమయం కల్పించేలా జారీ చేయాల్సిన టికెట్ల కోటా, ఇతర అంశాలపై మరో రెండు వారాల్లో మరో సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. వైకుంఠ ఏకాదశికి అవసరమైన పూల అలంకరణలు, వసతి, శ్రీవారి సేవకులు, స్కౌట్‌లను నియమించడం, ట్రాఫిక్ నిర్వహణ, పారిశుద్ధ్యం, ఇతర అంశాలపై కూడా ఆయన చర్చించారు.

ఆ పది రోజుల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు (ప్రోటోకాల్ వీఐపీలు మినహా), చంటి బిడ్డలు, వృద్ధులు, దివ్యాంగులు, ఆర్మీ, ఎన్ఆర్ఐ దర్శనాలు, ఆర్జిత సేవలు రద్దు చేయాలని నిర్ణయించారు. జనవరి 10న స్వర్ణ రథం ఊరేగింపు, 11న చక్ర స్నానం ఎస్వీబీసీలో ప్రత్యక్ష ప్రసారం చేయాలని, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో 10 రోజుల పాటు ఉదయం 6 గంటల నుండి అర్ధరాత్రి 12 గంటల వరకు అన్న ప్రసాదం పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సీవీఎస్‌వో శ్రీధర్, సీఈ సత్య నారాయణ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బంగాళాఖాతంలో వాయుగుండం

- **రాష్ట్రంలో రెండురోజులు వర్షాలు**
- **28,29 తేదీల్లో భారీ వర్షసూచన**

విశాఖపట్నం (చైతన్యరథం): దక్షిణ బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన వాయుగుండం.. 24 గంటల్లో మరింత బలపడి మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం సోమవారం తెలిపింది. ఈ ప్రభావంతో దక్షిణకోస్తా, ఉత్తరకోస్తాలో రానున్న రెండు రోజుల పాటు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. దీని ప్రభావంతో ఈ నెల 28, 29న నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, విశాఖ, శ్రీకాకుళం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. తీర ప్రాంతాల్లో 35 నుంచి 55 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. దక్షిణ కోస్తాలో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని.. ఇప్పటికే కోస్తాంధ్రలో ఒకటో నంబర్ ప్రమాద హెచ్చరికలు జారీ చేసినట్లు వెల్లడించింది. ఉత్తర కోస్తా రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.



# పేదోడికి మళ్లీ పట్టెడన్నం ప్రభుత్వ ధ్యేయం

◆ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్పష్టీకరణ

నందిగామ (చైతన్యరథం): ఎంతో మంది పేదలు తినడానికి తిండి లేక పస్తులుంటున్న సందర్భాలు ఉన్నాయని, అన్న క్యాంటీన్ల ద్వారా పేదల కడుపు నింపడం సంతోషంగా ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. ఎన్టీఆర్ జిల్లా, నందిగామ పురపాలక రైతు బజార్ వద్ద ఉన్న ఎన్టీఆర్ అన్న క్యాంటీన్‌ను సోమవారం ఎమ్మెల్యే సందర్శించి పేదలకు స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 2014-2019 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన అన్న క్యాంటీన్లను గత వైకాపా ప్రభుత్వం మూసివేసి నిరుపేదల పొట్టకొట్టిందని మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చాక తిరిగి అన్న క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకొస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఎన్డీయే ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుందన్నారు. ఎన్డీయే ప్రభుత్వం పేదోడికి మళ్లీ పట్టెడన్నం అందిస్తోందన్నారు. పేదలకు అన్నం పెట్టే ఈ మంచి కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని సౌమ్య పిలుపునిచ్చారు. తమ వంతుగా ప్రజలు విరాళాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలు పాల్గొన్నారు.



# చిరస్మరణీయ నటుడు ఆచంట వెంకటరత్నం నాయుడు

◆ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు నివాళి

విజయవాడ (చైతన్యరథం): తెలుగు రంగస్థలంలో ఒక చిరస్మరణీయ నటుడు ఆచంట వెంకటరత్నం నాయుడు అని, ఆయన అద్భుతమైన నటనతో తెలుగు ప్రేక్షకులను ఎంతగానో అలరించారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఆచంట వెంకటరత్నం నాయుడు వర్ధంతి సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆయన విగ్రహానికి ప్రభుత్వ విప్ బొండా ఉమా పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ, ఆచంట వెంకటరత్నం నాయుడు విజయవాడ సమీపంలోని నున్న అనే చిన్న గ్రామంలో జన్మించారని, చిన్నప్పటి నుంచి నాటకాలపై మక్కువ చూపించారని తెలిపారు. ఆయన పోషించిన పాత్రలలో దుర్యోధనుడి పాత్ర ఆయనకు ఎంతగానో పేరు తెచ్చిందని, ఆయన నటన చూసిన ప్రేక్షకులు ఆయనను అభినవ దుర్యోధనుడు అని పిలిచేవారు అన్నారు. ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి హంస పురస్కారం, నందమూరి తారక రామారావు స్మారక పురస్కారం వంటి అనేక పురస్కారాలు లభించాయన్నారు. ఆయన తెలుగువారి మనస్సుల్లో ఎల్లప్పుడూ జీవించి ఉంటారని బొండా ఉమ అన్నారు. ఈ కార్యక్రమంలో రోడ్డు సేఫ్టీ జిల్లా అధ్యక్షులు, ఎన్‌జిఓ సభ్యులు బీతు రామమోహనరావు, గోళ్ళ నారాయణరావు, ఆచంట బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### సీఎం సహాయనిధి పేదలకు వరం:బోండా ఉమా

పేదల వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి వరమని ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. సెంట్రల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని ఇద్దరికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొండా ఉమ మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ స్థాయిలో వైద్యం పొందలేని బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని పరిరక్షించడంతోపాటు మెరుగైన సమాజాన్ని అందించాలనే ఆలోచన విధానంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని తెలిపారు. ఇటీవల సంభవించిన తుఫానులో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన సహాయ కార్యక్రమాలతో స్ఫూర్తి పొందిన వేలాది మంది దాతలు సుమారు 600 కోట్ల నిధులను ముఖ్యమంత్రి సహాయనిధికి పంపించారని, ఇది చంద్రబాబు నాయుడుపై ఉన్న విశ్వసనీయతకు నిదర్శనమని ఎమ్మెల్యే అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 29వ డివిజన్ అధ్యక్షులు పీవీఆర్, గౌతమ్ ప్రసాద్, ఘంటా కృష్ణమోహన్, సింగం వెంకన్న, అడపా కోటేశ్వరరావు, బర్మా శ్రీను, అంగిరేకుల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# మూడు ఆలయాలకు కేంద్రం కొత్త పథకాలు

◆శ్రీశైలం, అమరావతి, సింహాచలం క్షేత్రాల ఎంపిక

◆పార్లమెంట్‌లో ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రశ్న

◆కేంద్ర మంత్రి సమాధానం



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు దేశంలో ప్రసాద్ పథకం కింద ఆమోదం పొందిన ప్రస్తుత ప్రాజెక్టుల పరిస్థితి, వాటికి మంజూరు చేసిన నిధులు, వినియోగంపై పూర్తి వివరాలివ్వాలని ఎంపి కేశినేని శివనాథ్ సోమవార పార్లమెంటు సమావేశాల్లో కేంద్రమంత్రిని కోరారు. ప్రసాద్ పథకం కింద కొత్త ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారా? లేదా పరిశీలనలో వున్నాయా అనే విషయం తెలపాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, కర్నూల్ ఎంపీ బస్తిపాటి నాగరాజు, కియోంజర్ ఎంపీ చరణ్ మాఝీ, కుషి నగర్ ఎంపి విజయ్ కుమార్ దూబేలతో కలిసి సోమవారం పార్లమెంట్ ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్ర టూరిజం శాఖ మంత్రిత్వ శాఖను కోరారు. అలాగే ఆంధ్రపదేశ్ నుంచి ప్రసాద్ పథకం కోసం కొత్తగా వచ్చిన ప్రతిపాదనలు తెలిపటంతో పాటు వాటి పరిస్థితి వివరించాలని ఎంపి కేశినేని శివనాథ్ కోరారు. ఈ ప్రశ్నలకు కేంద్ర టూరిజం శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ బదులిస్తూ పర్యాటక మంత్రిత్వ శాఖ ప్రసాద్ కింద 46 ప్రాజెక్టులను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లో 3 ప్రాజెక్టులు ఉన్నట్లు పేర్కొన్నారు. వాటిలో అమరావతి, శ్రీశైలం, సింహాచలం ఉన్నాయన్నారు. అమరావతిలో యాత్రికుల సదుపాయాల అభివృద్ధి కోసం 2015-16 లో రూ. 27.77 కోట్లు నిధులు విడుదల చేయగా ఆ నిధులను వంద శాతం వినియోగించినట్లు తెలిపారు. శ్రీశైలం ఆలయ అభివృద్ధి కోసం 2017-18 లో రూ. 43.08 కోట్లు నిధులు విడుదల చేయగా ఆ నిధులను వంద శాతం వినియోగించారని చెప్పారు. సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో యాత్రికుల సదుపాయాల అభివృద్ధి కోసం 2022-23లో రూ 54.04 కోట్లు నిధులు విడుదల చేయగా రూ. 13.69 కోట్లు మాత్రమే వినియోగించినట్లు వివరించారు. ప్రసాద్ పథకం కింద కాకినాడ జిల్లాలోని అన్నవరం దేవస్థానం, నెల్లూరు జిల్లా లోని వేదగిరి లక్ష్మీ నృసింహస్వామి దేవాలయం అభివృద్ధి చేయటానికి గుర్తించినట్లు తెలిపారు. ఈ పథకం కోసం ప్రతిపాదనలు వస్తున్నాయని కొన్ని పరిశీలనలో వున్నాయన్నారు.అయితే కొన్ని ప్రతిపాదనలు నిబంధనలకు అనుకూలంగా లేవని పేర్కొన్నారు.

### కేంద్రంలో ఏపీ పథకాలపై ఆరా తీసిన ఎంపీ చిన్ని

పీఎంఎస్‌హెచ్ఆర్ఐ పథకం పరిధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జిల్లాల వారీగా ఎంపిక చేసిన పాఠశాలల వివరాలు, ఆ పాఠశాలల అభివృద్ధికి జిల్లాల వారీగా మంజూరు చేసిన నిధులు, వాటి వినియోగం తెలపాలని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ సోమవారం పార్లమెంట్ ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పాఠశాల విద్య ,అక్షరాస్యత విభాగం గురించి ను ప్రశ్నించారు.

ఈ ప్రశ్నలకు కేంద్ర విద్యాశాఖ మంత్రి జయంత్ చౌదరి బదులిస్తూ ఈ పథకం కింద పాఠశాలలు భారత జాతీయ విద్యా విధానం 2020 లక్ష్యాలను ప్రతిబింబించేలా రూపొందించామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 855 పాఠశాలలు ఎంపిక కాగా, వాటిలో ప్రాథమిక పాఠశాలలు- 35, ప్రాథమికోన్నత పాఠశాలలు -27, సెకండరీ పాఠశాలలు -658, సీనియర్ సెకండరీ పాఠశాలలు - 135 ఉన్నాయన్నారు. వీటిని పారదర్శకంగా ఎంపికి చేసినట్లు చెప్పారు.

ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 855 పి.ఎమ్.-ఎస్.హెచ్.ఆర్.ఐ పాఠశాలల కోసం 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాల్లో రాష్ట్ర కేంద్ర వాటాలు కలుపుకొని మొత్తం 1056.44 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ మొత్తంలో కేంద్ర వాటా 633.88 కోట్లు, ఇందులో మొత్తం 293.66 కోట్లు ఆంధ్రప్రదేశ్‌లోని పాఠశాలల మౌలిక సదుపాయాల అభివృద్ధికి నాన్ రికరింగ్ ఫండ్‌గా మంజూరు చేశామని తెలిపారు.

# జంపనిలో ధాన్యం కొనుగోలు కేంద్రం



అమరావతి (చైతన్యరథం): రైతుకు అండగా, భరోసాగా ఉండాలన్నది కూటమి ప్రభుత్వం లక్ష్యం అని మాజీమంత్రి నక్కా ఆనంద్‌బాబు అన్నారు. అందులో భాగంగా ఈ ఖరీఫ్ సీజన్ కి సంబంధించి రైతులు నుండి నేరుగా దళారులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేమూరు మండలం జంపని గ్రామంలో మాజీ మంత్రి, వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు సోమవారం ప్రారంభించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రైతులందరికీ అండగా ఉంటుందని అన్నారు. రైతు సేవా కేంద్రం ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు కేంద్రాల ద్వారా వైసీపీ నాయకులు రైతుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసి అవినీతికి పాల్పడ్డారన్నారు. చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతిగా ఉంటుందన్నారు. 75కిలోల వరి ధాన్యం బస్తా రూ.1740లకు ఈ కేంద్రాల ద్వారా రైతులను నుంచి కొనుగోలు చేయనున్నామని తెలిపారు. రైతులందరూ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జగన్ అవినీతి అంతర్జాతీయ స్థాయికి చేరింది

◆పల్నాడు టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి విమర్శ

పల్నాడు, (చైతన్యరథం) : అవినీతి సంపాదనతో జగన్ రెడ్డి ఖ్యాతి అంతర్జాతీయ స్థాయికి చేరిందన్న విషయం అమెరికాలోని దర్యాప్తు సంస్థలు సైతం నిర్ధారించాయన్నారు. తాడేపల్లి అవినీతి అనకొండ జగన్‌చరిత్ర సప్త సముద్రాలు దాటిందని జిల్లా పార్టీ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ రెడ్డి అన్నారు. సోమవారం పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌లో ఏదైనా కుంభకోణం జరిగితే రాష్ట్రంలో మాత్రమే చర్చ జరిగేదన్నారు. ఇప్పుడు జాతీయంగా, అంతర్జాతీయంగా కూడా జగన్ అవినీతి గురించి చర్చించుకునే పరిస్థితి నెలకొందన్నారు. విద్యుత్ ఒప్పందాలలో రూ.1750 కోట్ల లంచాలను ఒక విద్యుత్ కంపెనీ నుంచి జగన్ రెడ్డి తీసుకున్న విషయాన్ని ఎఫ్‌బీఐ సైతం నిర్ధారించిందని అన్నారు. విద్యుత్ రంగంలో కూడా జగన్ రెడ్డి క్విడ్ ప్రోకోకు పాల్పడ్డారన్న విషయం అమెరికాలోని దర్యాప్తు సంస్థలు కూడా తేల్చాయన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను ఫణంగా పెట్టి జగన్ రెడ్డి ఏ విధంగా సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారో, ఈ సంఘటన ద్వారా బట్టబయలైందని, బహిరంగ మార్కెట్లో రూ.2 లోపే యూనిట్ విద్యుత్ అందుబాటులో ఉంటున్న రూ.2.49కి యూనిట్ విద్యుత్ కొనుగోలు చేసి వినియోగదారులపై కోట్ల రూపాయల భారం మోపడానికి ప్రయత్నించారన్నారు. జగన్ రెడ్డి చేసుకున్న విద్యుత్ ఒప్పందాల వెనుక లక్ష కోట్ల కుంభకోణం ఉందని తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడే స్పష్టం చేసిందని గుర్తు చేశారు. ఇప్పుడు అది ఆధారాలతో సహా బహిర్గత మైందన్నారు. తండ్రి అధికారంలో ఉన్నప్పుడు లక్ష కోట్లు కొల్ల గొట్టాడన్నారు. ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి రూ.8 లక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డారన్నారు. తన అవినీతిని విశ్వవ్యాప్తంగా తెలియజేసి, రాష్ట్రాన్ని 20 సంవత్సరాల వెనక్కి నెట్టాడన్నారు. ప్రతి ఒక్కరి పై అప్పులు మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు చంద్ర ఆంజనేయులు పాల్గొన్నారు.



# గూండాయిజం ప్రదర్శిస్తే ప్రజలే శిక్షిస్తారు

◆విపక్షాలపై ప్రధాని మోదీ ఆగ్రహం

న్యూఢిల్లీ: రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు అవుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుర్తు చేశారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభానికి ముందు పార్లమెంట్ వెలుపల మీడియా పాయింట్ వద్ద ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా విపక్ష ఇండియా కూటమిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రజలచే తిరస్కరణకు గురైన కొందరు గూండాయిజం ద్వారా పార్లమెంట్‌ను నియంత్రించేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నారంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. దేశ ప్రజలు వారి చర్యలన్నింటినీ లెక్కిస్తారని.. సరైన సమయంలో శిక్ష విధిస్తారని వ్యాఖ్యానించారు.



'కొందరు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పని చేస్తున్నారు. ప్రజలచే తిరస్కరణకు గురైన కొందరు గూండాయిజం ద్వారా పార్లమెంటుపై నియంత్రణకు ప్రయత్నిస్తున్నారు. సొంత లబ్ధి కోసం పార్లమెంటు సమావేశాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. దేశ ప్రజలు వారి చర్యలన్నింటినీ లెక్కిస్తారు. సరైన సమయంలో ప్రజలే శిక్ష విధిస్తారు. పార్లమెంట్‌లో సానుకూల చర్చలు జరగాలని కోరుకుంటున్నా' అని మోదీ వ్యాఖ్యానించారు. ఈ పార్లమెంట్ సమావేశాలు ఎన్నో అంశాలపరంగా ముఖ్యమైనవని ప్రధాని అన్నారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి నవంబర్ 26 నాటికి 75వ ఏడాదిలోకి అడుగుపెడుతున్నామన్నారు. దానికి గుర్తుగా రేపు సంవిధాన్ సదన్‌లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజ్యాంగ అమలు ఉత్సవాలు ఐక్యంగా నిర్వహించుకోవాలని మోదీ పిలుపునిచ్చారు.

"ప్రపంచం ఇప్పుడు మనల్ని ఎంతో ఆశావహ దృక్పథంతో చూస్తోంది. ఆ గౌరవం పెంపొందేలా సభలో మన ప్రవర్తన ఉండాలి. పార్లమెంట్ వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం ఉంది. దానికి అనుగుణంగా మనం నడుచుకోవాలి. వివిధ అంశాలను సరైన రీతిలో సభలో ఎత్తిచూపడం ద్వారా మనం వారి ఆకాంక్షలను నెరవేర్చగలం. దానినుంచి రాబోయే తరాలు ప్రేరణ పొందుతాయి. ఈ సెషన్ ఫలవంతంగా ఉంటుందని ఆశిస్తున్నాను. ఈ సమావేశాలను ఉత్సాహంగా ముందుకుతీసుకెళ్లాలని ఎంపీలందరినీ కోరుతున్నాను" అని మోదీ అన్నారు.

# అదానీ వ్యవహారంపై చర్చించాల్సిందే!

◆పట్టుపట్టిన విపక్షాలు..
రాజ్యసభలో గందరగోళం



న్యూఢిల్లీ: పార్లమెంట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ లంచం వ్యవహారంపై రాజ్యసభలో ఎంపీ మల్లికార్జున ఖర్గే ప్రస్తావించారు. అదానీ అవినీతి అంశంపై చర్చించాలని ఆయన పట్టుబట్టారు. దీంతో రాజ్యసభలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. అదానీ అవినీతి అంశం దేశాన్ని ప్రభావితం చేస్తోందని ఖర్గే అన్నారు. అదానీకి ప్రధాని నరేంద్ర మోదీ మద్దతుగా నిలుస్తున్నారని ఖర్గే ఆరోపించారు. దీంతో అదానీపై అంశంపై విపక్షాలు సైతం చర్చకు పట్టుపట్టాయి. అనంతరం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సభలో విపక్ష పార్టీల నేతలు నినాదాలు చేశారు. దీంతో రాజ్యసభ సమావేశాలను ఛైర్మన్ ఎల్లుండికి వాయిదా వేశారు. మరోవైపు లోక్ సభ సమావేశాలను సైతం స్పీకర్ ఎల్లుండికి వాయిదా వేశారు. కాగా, డిసెంబర్ 20వ తేదీ వరకూ పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరగనున్నాయి.

**ఉభయ సభలు బుధవారానికి వాయిదా**

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు బుధవారానికి వాయిదా పడ్డాయి. సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఉభయ సభలు.. తొలుత ఇటీవల మృతి చెందిన సభ్యులకు సంతాపం తెలిపాయి. ఆ తర్వాత లోక్‌సభ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడింది. సభ తిరిగి ప్రారంభమైన తర్వాత అదానీ అంశంపై చర్చించాలని విపక్షాలు పట్టుబడ్డాయి. దీంతో సభలో గందరగోళం నెలకొనడంతో స్పీకర్ ఓంబిర్లా సభను బుధవారానికి వాయిదా వేశారు.

అటు రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి తలెత్తింది. దీంతో ఎగువ సభను ఛైర్మన్ ధన్‌కర్ బుధవారానికి వాయిదా వేశారు. ఉభయ సభలు బుధవారం ఉదయం 11 గంటలకు తిరిగి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 20 వరకు జరిగే ఈ సమావేశాల్లో వక్ఫ్ (సవరణ) సహా 16 బిల్లులను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నది. మణిపూర్ హింస, గౌతమ్ అదానీ అవినీతి చర్యలపై యూఎస్ అరెస్ట్ వారెంట్, ఢిల్లీలో వాయు కాలుష్యం తదితర అంశాలపై ఈ సమావేశాల్లో మోదీ సర్కారును నిలదీసేందుకు విపక్షాలు సిద్ధమయ్యాయి.



# అండమాన్ తీరంలో ఐదు టన్నుల డ్రగ్స్ స్వాధీనం

అండమాన్ తీరంలో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. ఫిషింగ్ బోట్ నుంచి దాదాపు 5 టన్నుల డ్రగ్స్‌ను ఇండియన్ కోస్ట్ గార్డ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. కోస్ట్‌గార్డ్ చరిత్రలోనే ఇంత భారీ మొత్తంలో మాదకద్రవ్యాలు పట్టుకోవడం ఇదే తొలిసారి అని రక్షణ అధికారులు తెలిపారు. 'అండమాన్ తీరంలో ఇండియన్ కోస్ట్ గార్డ్ సిబ్బంది భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకుంది. సుమారు 5 టన్నుల డ్రగ్స్‌ను పట్టుకుంది. ఇండియన్ కోస్ట్ గార్డ్ చరిత్రలోనే ఇంత భారీ మొత్తంలో మాదకద్రవ్యాలు పట్టుకోవడం ఇదే తొలిసారి' అని డిఫెన్స్ అధికారి ఒకరు తెలిపారు.

# ఆ ఇద్దరి మధ్య ఆసక్తికర సంభాషణ!

◆బాబాయి (అజిత్ పవార్), అబ్బాయి (రోహిత్ పవార్) ఎదురైన వేళ..!



ముంబై: ఇటీవల జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో పవార్‌ల మధ్య పోరు ప్రాముఖ్యం సంతరించుకుంది. తాజాగా ఓ కార్యక్రమంలో బాబాయి (అజిత్ పవార్), అబ్బాయి (రోహిత్ పవార్)ల మధ్య జరిగిన సంభాషణ వైరల్‌గా మారింది. మహారాష్ట్ర తొలి ముఖ్యమంత్రి వై బీ చవాన్ వర్ధంతి సందర్భంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్, ఆయన సోదరుడి కుమారుడు ఎన్సీపీ (ఎస్పీ)నేత రోహిత్ పవార్ ఒకరికొకరు ఎదురుపడ్డారు. అతడిని చూసిన వెంటనే అజిత్ చిరునవ్వులు చిందిస్తూ "వచ్చి ఆశీర్వాదం తీసుకో.. నీ నియోజకవర్గంలో నేను ర్యాలీ చేసి ఉంటే ఎలా ఉండేదో తెలుసా?" అంటూ చమక్కులు విసిరారు. దీంతో రోహిత్ ఆయన కాళ్లకు నమస్కరించారు.

అజిత్ పవార్ తండ్రితో సమానం

అనంతరం రోహిత్ పవార్ మీడియాతో మాట్లాడుతూ.. తమ మధ్య రాజకీయంగా ఎన్ని విభేదాలు ఉన్నప్పటికీ అజిత్ పవార్ తన తండ్రితో సమానమని అన్నారు. పెద్దవారిని గౌరవించాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఆయన తనకు సహాయం చేశారని గుర్తు చేసుకున్నారు. బారామతిలో బిజీగా ఉన్నందువల్ల ఈ ఎన్నికల్లో తన తరఫున ప్రచారానికి హాజరుకాలేకపోయారని అన్నారు. ఇటీవల జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రోహిత్ పవార్ ఖజరత్ జమేఖేడ్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి 1,234 ఓట్ల స్వల్ప ఆధిక్యంతో గెలిచారు.

కాగా పవార్ల కుటుంబానికి కంచుకోటగా భావించే బారామతి ఇటీవల పవార్ కుటుంబ సభ్యుల మధ్యే పోటీకి వేదికగా నిలిచింది. ఎన్సీపీ తరఫున అజిత్ పవార్ ఈ స్థానం నుంచి



బరిలోకి దిగగా, ఆయన సోదరుడు శ్రీనివాస్ కుమారుడు యుగేంద్ర పవార్ ఇదే స్థానం నుంచి ఎన్సీపీ (ఎస్పీ) అభ్యర్థిగా పోటీ చేసి, అజిత్ పవార్ చేతిలో ఓడిపోయారు.

మహారాష్ట్రలో మొత్తం 288 సీట్లు ఉండగా.. మహాయుతి కూటమి 233 స్థానాల్లో విజయం సాధించింది. ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ కూటమి 51 చోట్ల గెలుపొందింది. శివసేన (శిండే) 57, ఎన్సీపీ (అజిత్ పవార్) 41 స్థానాల్లో జయకేతనం ఎగరవేశాయి. ఇకపోతే, శివసేన (ఉద్ధవ్) పార్టీ 20 చోట్ల విజయం సాధించగా.. కాంగ్రెస్ 16, ఎన్సీపీ (ఎస్పీ) 10 స్థానాలు గెలుచుకున్నాయి.

# మహా పీసీసీ అధ్యక్ష పదవికి నానా పటోలే రాజీనామా

ముంబయి: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విపక్ష మహా వికాస్ అఘాడీ ఓటమి చవిచూసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. 'మహా' ఎన్నికల్లో పార్టీ ఓటమికి బాధ్యత వహిస్తూ పీసీసీ అధ్యక్ష పదవికి నానా పటోలే రాజీనామా చేశారు. ఎన్నికల్లో ఆయన సకోలి స్థానం నుంచి 208 ఓట్ల మార్జిన్‌తో గెలుపొందారు.



మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 288 సీట్లు ఉండగా.. మహాయుతి కూటమి 233 స్థానాల్లో విజయం సాధించింది. ఆటు ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ కూటమి 51 చోట్ల గెలుపొందింది. కూటమిలో భాగంగా 101 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ కేవలం 16 స్థానాలు మాత్రమే గెలుచుకోవడంతో పార్టీకి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. మహారాష్ట్ర ఏర్పడిన నాటినుంచి ఎన్నడూ లేనంత బలహీనంగా కాంగ్రెస్ మారిపోయింది.

2014లో పార్టీపై వెల్లువెత్తిన అవినీతి ఆరోపణలు.. మోదీ హవాతో మహారాష్ట్రలో కాంగ్రెస్ తీవ్రంగా దెబ్బతింది. అప్పట్లో కేవలం 42 సీట్లు మాత్రమే సాధించింది. నాటినుంచి మళ్లీ కోలుకోలేదు. తాజా ఎన్నికల్లో పాలిక స్థానాలు కూడా సాధించలేకపోయింది. కొన్ని వర్గాలపై అధికంగా ఆధారపడటం, పార్టీ నేతలు ప్రజల్లోకి వెళ్లకపోవడం.. తదితర అంశాలతో పార్టీ ప్రజాదరణను కోల్పోతోందని రాజకీయ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

2021లో నానా పటోలే మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో.. ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ పోటీ చేసిన 17 స్థానాలకు గాను 13 స్థానాలను గెలుచుకొని, అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది.